

27 వరకు వర్షాలు

మోస్తరు నుంచి భారీగా కురిసే అవకాశం

- వర్షాలతో వరి నారుమడుల్లో కలుపు బెడద
- రాగి పంటకు అగ్గి తెగులు, వేరుశనగకు మొదలు కుళ్లు తెగులు..
- నివారణ చర్యలకు శాస్త్రవేత్తల సూచనలు

అనకాపల్లి అగ్రికల్చర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాగల ఐదు రోజుల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం వుందని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సిహెచ్.ముకుందరావు తెలిపారు. మంగళవారం ఇక్కడ వివిధ విభాగాల శాస్త్రవేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 27వ తేదీ వరకు ఆకాశం మేఘావృతమై అప్పుడప్పుడు వర్షం పడే అవకాశం ఉందన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 32.8 నుంచి 34 డిగ్రీల వరకు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 25.8 నుంచి 26.7 డిగ్రీల వరకు నమోదు కావచ్చని తెలిపారు. వర్షాల కారణంగా వరినారుమడుల్లో కలుపు సమస్య వుంటుందని, దీని నివారణకు విత్తిన 14-15 రోజులప్పుడు సైహలోఫాస్ బ్యుటైల్ 10 శాతం మందును లీటరు నీటికి రెండు మిల్లీ లీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి నారును అగ్గితెగులు ఆశించే అవకాశం వుందని, ఈ తెగులు లక్షణాలు కనిపించినట్టయితే లీటరు నీటికి ట్రైసోక్లోజోల్ 0.6 గ్రాములు లేదా ఐసోప్రోథాయోలిన్ 1.5 మిల్లీ లీటర్ల చొప్పున కలిపి వర్షం కురవని సమయంలో ... మిగతా 8వ పేజీలో

విద్యుత్ చార్జీలు పెంచలేదు, పెంచబోము

- ఆగస్టు 15 నుంచి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్.సవిత

అనకాపల్లి టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచలేదని, ఇకపై పెంచబోదని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్.సవిత అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆమె మంగళవారం అనకాపల్లి విచ్చేశారు. ఈ సందర్భంగా గవరపాలెం రజక కాలనీలో మీడియాతో మాట్లాడారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్న తీరును పరిశీలించేందుకు ఇంటింటికీ వెళుతున్నామన్నారు. సామాన్య కార్యకర్తల నుంచి మంత్రుల వరకూ అంతా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నామన్నారు. బీసీలకు పెద్దపీట వేసింది తెలుగుదేశం ప్రభుత్వమేనని పేర్కొన్నారు. చేతివృత్తిదారులకు ఆదరణ పథకం ద్వారా రూ.వెయ్యి కోట్లు మంజూరుచేశారన్నారు. దీపం-1, దీపం-2 పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. ఆయన మహిళా పక్షపాతి అని కొనియాడారు. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా నెలకు రూ.నాలుగు వేలు పింఛన్ ఇస్తున్న ఘనత ఆంధ్రప్రదేశ్‌కే దక్కుతుందన్నారు. కొంతమంది ముద్దుల మావయ్య అని చెప్పుకుంటున్నారని అసలైన ముద్దుల మావయ్య మంత్రి నారా లోకేశ్ అని మంత్రి సవిత అన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్ సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో ముఖ్యమంత్రి ... మిగతా 8వ పేజీలో



అనకాపల్లిలో మంగళవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఎస్.సవిత. చిత్రంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, తదితరులు ఉన్నారు.

అధ్వానంగా పుష్కరిణి

చోడవరం స్వయంభూ గౌరీశ్వరాలయంలో పడకేసిన అభివృద్ధి పనులు

- గత ఏడాది రూ.80 లక్షలు మంజూరు చేయించిన ఎమ్మెల్యే
- నవంబరులో పనులు ప్రారంభం.. కొద్ది రోజులకే నిలుపుదల
- పరిపాలనాపరమైన ఆమోదం లభించలేదంటున్న అధికారులు
- చెత్తాచెదారం, తుప్పలతో దుర్గంధ భరితం



పుష్కరిణిలో పెరిగిపోయిన జమ్ము గడ్డి

చోడవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): **పట్టణంలో ప్రముఖ శైవక్షేత్రం స్వయంభూ గౌరీశ్వరాలయం పుష్కరిణి దయనీయ స్థితిలో ఉంది. భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తూ, పవిత్రంగా భావించే పుష్కరిణిలో తుప్పలు పెరిగిపోయాయి. చెత్తాచెదారం పేరుకుపోయి డంపింగ్ యార్డుగా మారింది. నీరు కలుషితమై దుర్వాసన వస్తున్నది.**

ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రాల్లో చోడవరం స్వయంభూ గౌరీశ్వరాలయం ఒకటిగా గుర్తింపు పొందింది. శతాబ్దాల చరిత్ర వున్న ఈ ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. కార్తీక మాసంలో భక్తుల తాకిడి అధికంగా ... మిగతా 8వ పేజీలో



అపరిశుభ్రవంగా ఉన్న స్వయంభూ గౌరీశ్వరాలయం పుష్కరిణి ఘాట్

అన్నదాతకు అండగా...

సత్ఫలితాలు ఇస్తున్న 'పొలం పిలుస్తోంది'

- రైతుల చెంతకు అధికారులు, శాస్త్రవేత్తలు
- పంటల సాగులో ఆధునిక పద్ధతులు, అధిక దిగుబడుల సాధనపై సలహాలు, సూచనలు
- వారంలో రెండు రోజులపాటు నిర్వహణ
- ఇప్పటికే 254 గ్రామాల్లో పూర్తి
- సంతృప్తి వ్యక్తం చేస్తున్న రైతులు



ఎలమంచిలి మండలం రామారాయుడుపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ సిబ్బంది

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి) **రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాగులో మెలకువలు అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు వారంలో రెండు రోజులపాటు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పంటల సాగు, సస్యరక్షణ చర్యలు, అధిక దిగుబడుల సాధనకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నారు. దీంతో అన్నదాతలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.**

గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నప్పుడు (2014-19) సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రైతులకు పంట సాగులో సూచనలు, సలహాలు అందించేందుకు వ్యవసాయ, ఉద్యానవన శాఖలు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించాయి. దీనిలో భాగంగా వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు గ్రామాల్లోకి వెళ్లి రైతులతో ముఖాముఖి మాట్లాడేవారు. వారి సాధక బాధకాలను విని, వాటిని పరిష్కరించేందుకు పలు సలహాలు ఇచ్చేవారు. ఈ కార్యక్రమంలో రైతులకు ఎంతో ఉపయోగపడడంతో గత ఏడాది సీఎం చంద్రబాబు నేతృత్వంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని పునరుద్ధరించింది. ఈ కార్యక్రమం ద్వారా ఆధునిక పద్ధతుల్లో పంటల సాగు, అధిక దిగుబడుల సాధన, చీడపీడల నివారణకు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. గత నెల 17వ తేదీన ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని వారంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులతో కలిసి బృందాలుగా ఏర్పడి ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ప్రతి మంగళ, బుధవారాల్లో ఆయా గ్రామాలను సందర్శిస్తున్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు అనుసరించాల్సిన నూతన పద్ధతుల గురించి తెలియజేస్తున్నారు. శాస్త్రవేత్తలు ... మిగతా 8వ పేజీలో

పరవాడలో పట్టపగలు చోరీ

- నాలుగు తులాల బంగారం, రూ.50 వేల నగదు అపహరణ



బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ విష్ణుస్వరూప్

పరవాడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): **పరవాడలో తాళం వేసి వున్న ఇంటిలో పట్టపగలు చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువాలో వున్న నాలుగు తులాల బంగారం, రూ.50 వేలు నగదు అపహరించుకుపోయారు. ఇందుకు సంబంధించి సీఐ ఆర్.మల్లికార్జునరావు అందించిన వివరాలిలా ఉన్నాయి.**

వెన్నెలపాలెం గ్రామానికి చెందిన పైలా సన్యాసిరావు కుటుంబంతో సహా పరవాడ సినిమాహాల్ జంక్షన్ నుంచి వెన్నెలపాలెం వెళ్లే రోడ్డులో సంతోషిమాత ఆలయానికి ఎదురుగా నాలుగు అంతస్థుల భవనం నిర్మించుకున్నారు. ఇందులో మూడు ఫ్లోర్లు... మిగతా 8వ పేజీలో

వానరాలతో హడల్!

- పట్టణంలో గుంపులుగా సంచారం
- పట్టించుకోని అధికారులు
- నానాటికీ పెరిగిపోతున్న సంతతి

ఎలమంచిలి వాసులను బెంబేలెత్తిస్తున్న కోతులు



యర్రవరం ప్రాంతంలో రహదారిపై తిష్ఠవేసిన కోతులు

ఎలమంచిలి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): **స్థానిక మునిసిపాలిటీలో కోతుల బెడద నానాటికీ అధికం అవుతున్నది. ఏళ్ల తరబడి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న వానర దండుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి వచ్చినప్పటికీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. నిరంతరం తమను ఇబ్బంది పెడుతున్న కోతులను పట్టుకొని, అటవీ ప్రాంతంలో వదిలేయడంలో ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.**

మునిసిపాలిటీలో సుమారు ఆరు సంవత్సరాల నుంచి కోతుల సంతతి అధికంగా వుంది. వీధుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. దారినపోయే వారిపై దాడి చేస్తున్నాయి. ఇళ్ల ఆవరణల్లోకి, మేడలపైకి యథేచ్ఛగా చొరబడుతున్నాయి. ఆహార పదార్థాలను తిన్నంత మేర తినేసి, మిగిలిన వాటిని పాడు చేస్తున్నాయి. తరుముదామంటే.. మీదకు వచ్చి కరుస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. వీటి ఆగడాలతో జనం బెంబేలెత్తిపోతున్నారు. కోతుల దాడిలో ప్రాణాలు పోతే తప్ప.. అధికారులు పట్టించుకోరా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. కోతులకు భయపడి చిన్నారులు, మహిళలు రహదారులపై రాకపోకలు సాగించాలంటే హడలిపోతున్నారు. పట్టణంలో ప్రధానంగా రామ్‌నగర్, అల్లూరి సీతారామరాజు కాలనీ, కొత్తపేట, మిలట్రీ కాలనీ, గాంధీనగర్, రైల్వే స్టేషన్ రోడ్డు, యానాద్రి కాలనీ, యర్రవరం ప్రాంతాల్లో కోతుల సంచారం అధికంగా వుంది. అటవీ శాఖ అధికారులు గతంలో ఒకసారిఇ కోతులను పట్టించి, అటవీ ప్రాంతాలకు తరలిచేలా చర్యలు చేపట్టారు. అయితే కొద్ది కాలానికే వానర దండు తిరిగి వచ్చేసింది. కొంతకాలం క్రితం పట్టణంలో పర్యటించిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్.. కోతుల గుంపులను చూసి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా వుండేందుకు వీటిని పట్టించి అటవీప్రాంతాని తరలించాలని అధికారులను ఆదేశించారు. కానీ ఇంతవరకు స్పందనలేదు.

సామాన్లు పట్టుకెళుతున్నాయ్



పట్టణంలోని మిలట్రీ కాలనీ ప్రాంతంలో ఉన్న నా దుకాణం తలుపులు మూసుకుని వ్యాపారం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కోతులు మూకుమ్మడి వచ్చి షాపులో ఉన్న సామాన్లు పట్టుకుపోతున్నాయి అడ్డుకుంటే.. మీదకు వచ్చి కరిచేలా ప్రవర్తిస్తున్నాయి. అధికారులు స్పందించి, కోతులను పట్టించి అడవుల్లో విడిచిపెడితే బాగుంటుంది.

ఎ.చిన్నారావు, చిరువ్యాపారి

రెండు చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

- 21.5 తులాల బంగారం, 900 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం





నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి వస్తువులు. (ఇన్‌సెట్‌లో) డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మాడుగులలో రెండు ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ ఎం.శ్రావణి చెప్పారు. తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె వెల్లడించిన వివరాలిలా వున్నాయి. మాడుగులకు చెందిన కోడూరు లక్ష్మి ఈ నెల మొదటి వారంలో ఇంటికి తాళాలు వేసి, విశాఖలో వుంటున్న అల్లుడి ఇంటికి వెళ్లింది. 14వ తేదీన ఇంటికి వచ్చి చూడగా, తలుపులు తీసి వున్నాయి. బీరువాలో భద్రపరిచిన ఇరవైన్నర తులాల బంగారం, అర కిలో వెండి వస్తువులు, లక్షా 90 వేల రూపాయల నగదు కనిపించలేదు. అంతకుముందు నాలుగో తేదీన కోరుకొండ జగన్నాథస్వామి నివాసంలో తులం బంగారం, పావు కిలో వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. కోడూరు లక్ష్మి ఇంటికి సమీపంలో నివాసం వుంటున్న బెజవాడ రాము అనే వ్యక్తి ఈ చోరీలకు పాల్పడినట్టు గుర్తించారు. అతని కోసం గాలిస్తుండగా మంగళవారం ఉదయం ఘాట్ రోడ్డు జంక్షన్ వద్ద పట్టుబడ్డాడు. రాము గతంలో ఒక హల్వా షాపులో కూలీగా పనిచేసేవాడు. చెడు వ్యసనాలు వున్న ఇతనికి.. వచ్చే కూలి డబ్బులు చాలకపోవడంతో చోరీలకు అలవాటు పడ్డాడు. నిందితుడు నుంచి ఇరవై ఒకటిన్నర తులాల బంగారం వస్తువులు, 900 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కోడూరు లక్ష్మి నివాసంలో చోరీ చేసిన నగదును సొంతానికి వాడేసుకున్నాడు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. కాగా నిందితుడు రాముపై విశాఖ నగర పరిధిలోని మహారాణిపేట, టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌ల్లో రెండు కేసులున్నాయని డీఎస్పీ తెలిపారు. మీడియా సమావేశంలో కె.కోటపాడు సీఐ పి.పైడపునాయుడు, మాడుగుల ఎస్‌ఐ నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటక శాఖ భూములు లీజుకు

ఔత్సాహికులకు అవకాశం

- ప్రాజెక్టులు పర్యాటకులను ఆకర్షించేలా, ఆ ప్రాంత అభివృద్ధికి దోహదపడేలా, ఉపాధి అవకాశాలు కల్పించేలా ఉండాలి
- ఎంఎస్ఎంఈలకు ప్రాధాన్యం
- విశాఖ జిల్లాలో 18కి పైగా ప్రాంతాలు.. అనకాపల్లిలో 5...
- పారదర్శక విధానంలో కేటాయింపునకు కమిటీ ఏర్పాటు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక పాలసీని రూపొందించింది. ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించడానికి, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించడానికి ప్రభుత్వ భూములను దీర్ఘకాలిక లీజుకు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ వ్యవహారం పారదర్శకంగా జరగడానికి ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ అధ్యక్షతన మరో ఎనిమిది మందితో ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసింది. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో గల ప్రభుత్వ భూముల్లో పర్యాటక అభివృద్ధికి ఉపయోగపడే వాటిని ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ (ఏపీటీఏ)కి అప్పగించింది. ఔత్సాహికులు ఎవరైనా సరే ఏపీటీఏకి దరఖాస్తు చేస్తే, వాటిని కమిటీ పరిశీలించి భూముల కేటాయింపునకు సిఫారసు చేస్తుంది. విశాఖపట్నంలో జిల్లాలో 18 ప్రాంతాలు, అనకాపల్లి జిల్లాలో ఐదు ప్రదేశాలు లీజుకు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

పర్యాటకులను ఆకర్షించేలా, ఆ ప్రాంత అభివృద్ధికి దోహదపడేలా, ఉపాధి అవకాశాలు పెరిగేలా ప్రాజెక్టులు ఉండాలి. భూమిని తీసుకున్న వారు మౌలిక వసతులు అభివృద్ధి చేయాలి. హోటళ్లు, రిసార్ట్స్, వెల్‌నెస్ సెంటర్లు, ఎమ్యూజ్‌మెంట్ పార్కులు, మైస్ సౌకర్యం (చిన్న చిన్న సమావేశాలు, సభలు నిర్వహించుకునేలా) కల్పించేలా ప్రాజెక్టులు రూపొందించాలి. పెట్టుబడి మొత్తం వారే పెట్టుకోవాలి. ప్రాజెక్టును బట్టి ఎంత కాలం భూమిని లీజుకు ఇవ్వాలనేది కమిటీ నిర్ణయిస్తుంది. ఇవన్నీ పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలోనే చేపడతారు. భూ కేటాయింపునకు ప్రత్యేక పాలసీ రూపొందించారు.. లార్జ్, మెగా, అల్ట్రా మెగా ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.



ఎండాడలో పర్యాటక శాఖకు అప్పగించిన భూములు

జిల్లాలో ఎక్కడెక్కడంటే...?

- నక్కపల్లి మండలం న్యాయంపూడి సర్వే నంబరు 80/2లో 1.17 ఎకరాలు.
- పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం సర్వే నంబరు 324/2లో 12.52 ఎకరాలు
- అచ్యుతాపురం మండలం పూడిమడక సర్వే నంబరు 85/3లో 2.58 ఎకరాలు
- ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం సర్వే నంబరు 380లో 5 ఎకరాలు
- అనకాపల్లి మండలం శంకరంలో 150, 143, 144, 154 సర్వే నంబర్లలో 1.4 ఎకరాలు

జాతీయ సబ్‌జూనియర్ హాకీ టోర్నీకి నలుగురి ఎంపిక



హాకీ టోర్నీకి ఎంపికైన క్రీడాకారులు

ఎలమంచిలి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28 వ తేదీ నుంచి చెన్నైలో జరగనున్న జాతీయ సబ్ జూనియర్ హాకీ టోర్నీకి అనకాపల్లి జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్టు హాకీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నరేష్ మంగళవారం తెలిపారు. ఈ టోర్నీకి ఎలమంచిలి, అనకాపల్లి, నక్కపల్లి ప్రాంతాలకు చెందిన పందూరి భరత్, చరణ్, దేవేందర్, వెంకట్ స్వరూప్‌లు ఎంపికైనట్టు తెలిపారు.

విత్తన శుద్ధితో ఎంతో మేలు

▸▸ జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న మోహనరావు

ఎలమంచిలి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు విత్తన శుద్ధి చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు సూచించారు. మంగళవారం ఆయన రామారాయుడుపాలెంలో పర్యటించారు. రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులు, వాటి ఫలితాలు గురించి వివరించారు. వరి నాట్లు మెషిన్ ద్వారా వేసుకున్నట్టయితే పెట్టుబడి తగ్గి అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. దీని వలన కూలీల కొరత లేకుండా ఉంటుందన్నారు. విత్తనశుద్ధి చేయడం, వరి నాట్లు వేసేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు గురించి శాస్త్రవేత్తలు భవాని, కుమారి, నాగేంద్రలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ జాహ్నవి, ఏఓ, మోహనరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త ఎంపిక సరైనదే

▸▸ ఎంపికలో లోపాలు లేవని అధికారులు స్పష్టీకరణ



గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న అధికారులు

అచ్యుతాపురం రూరల్, జూలై 22, (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపేటలో అంగన్‌వాడీ కారకర్త ఎంపికపై జరుగుతున్న ఆందోళన శిబిరాన్ని మంగళవారం స్థానిక తహసీల్దార్ సత్యనారాయణ, ఐసీడీఎస్ పీడీ ఎస్.సూర్యలక్ష్మి, సీడీపీఓ ఇందిరాదేవి సందర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్త ఎంపిక ప్రక్రియలో అవకతవకలు జరిగాయంటూ మంత్రి సునీత రిలే నిరాహార దీక్ష చేయడంతో ఆమెకు మద్దతుగా గ్రామ పెద్దలు, దళిత సంఘాల నాయకులు నిలిచారు. దీంతో ఆందోళన విరమింపజేసే ప్రయత్నంలో భాగంగా అధికారులు శిబిరాన్ని సందర్శించి, వివరాలు తెలియజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తగా భారతిని ఎంపిక చేసిన ప్రక్రియ సరైనదిగా ఉందన్నారు. ఆమె సర్టిఫికెట్లు అన్నీ సక్రమంగా ఉన్నాయని, ఎంపికలో ఎలాంటి లోపాలు లేవని తెల్పి చెప్పారు. దీక్ష విరమింపజేయాలని గ్రామ నాయకులను కోరడంతో వారు సానుకూలంగా స్పందించినట్టు అధికారులు ప్రకటించారు.

లింగాపురంలో పారిశుధ్య పనుల పరిశీలన



లింగాపురంలో చెత్త తరలింపును పరిశీలిస్తున్న అధికారులు

కోటవురట్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపురం గ్రామ పంచాయతీలో ముమ్మరంగా పారిశుధ్యపనులు జరుగుతున్నాయి. మంగళవారం ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీడీవో రఘురామ్, సర్పంచ్ కోరుప్రోలు రమణ గ్రామంలో పర్యటించి పారిశుధ్యం పనులు పరిశీలించారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు డ్రైనేజీల్లో చెత్తచెదారం తొలగించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరాలు వస్తే వెంటనే ఆస్పత్రికి వెళ్లి డాక్టర్లను సంప్రదించాలనిన సూచించారు. గ్రామంలో ఎప్పటికప్పుడు డ్రైనేల్లో చెత్తచెదారం క్లీనింగ్ చేయించాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు.

రెండు నెలలకే పాడైన రోడ్డు



పైకి తేలిన తారు పెచ్చులు

నక్కపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునిపూడి గ్రామంలో రెండు నెలల క్రితం నిర్మించిన రోడ్డు దెబ్బతిందని గ్రామస్థులు తెలిపారు. పంచాయతీరాజ్, ఉపాధి హామీ పథకం నిధులు రూ.1.3 కోట్లతో నిర్మించిన రహదారి నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల దెబ్బతిందని వారంటున్నారు. రహదారి నిర్మాణానికి కాంట్రాక్టర్ నాసిరకం మెటీరియల్ వినియోగించడం వల్ల ఎక్కడికక్కడే రోడ్డు గోతులపడిదని, రాళ్లు పైకి తేలి కనబడుతున్నాయని మత్స్యకార నాయకుడు కొవిరి వెంకటేశ్ చెప్పారు. నాసిరకం మెటీరియల్‌తో రోడ్డు పనులు చేపట్టేవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా నూకాలమ్మ సారె ఊరేగింపు



రమణయ్యపేటలో సారె ఊరేగింపు చేస్తున్న మహిళలు

నక్కపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రమణయ్యపేటలో మంగళవారం గ్రామదేవత నూకాలమ్మ సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. గ్రామ మహిళలు భక్తిశ్రద్ధలతో పురవీధుల్లో సారెను ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. ఆషాఢమాసం చివరి మంగళవారం కావడంతో అమ్మవారికి సారె సమర్పణ చేశారు. అనేక మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

తీర ప్రాంత భూములను పరిశీలించిన కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్ కృష్ణన్

నక్కపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీర ప్రాంతంలో మంగళవారం జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ పర్యటించారు. బల్క్‌డ్రగ్ కోసం కేటాయించిన భూములు, అదనపు భూములు సేకరించే గ్రామాల భౌగోళిక మ్యాప్‌లను ఆమె పరిశీలించారు. బల్క్‌డ్రగ్ పార్కుకు సంబంధించి జరుగుతున్న పనులను ఆమె పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులపై ఆరా తీశారు. కారిడార్ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పెదబోదిగల్లం లేఅవుట్‌ను ఆమె పరిశీలించారు. ఆర్డీవో వీవీవీ రమణ, తహసీల్దార్ నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లపై మురుగు నీరు

▸▸ ఇబ్బంది పడుతున్న లోవపాలెం గ్రామస్థులు

▸▸ డ్రైనేజీలు లేకపోవడమే కారణం



సముద్ర తీరానికి వెళ్లే సీసీరోడ్డుపై నిలిచిన వాడుకనీరు

రాంబిల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్.చింతువా పంచాయతీ లోవపాలెం గ్రామంలో పలు వీధుల్లోని సీసీరోడ్లు కాలువలను తలపించే విధంగా తయారయ్యాయి. వీధుల్లో డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్లలోని వాడుకనీరు రోడ్లపై ప్రవహిస్తున్నది. దీంతో సీసీరోడ్లు కాలువల్లా మారిపోయి



గ్రామం మధ్యలో సీసీరోడ్డుపై ఉన్న వాడుకనీరు

కంపుకొడుతున్నాయి. గ్రామంలోని కొళాయిల వద్ద వృథా నీరు కూడా సీసీ రోడ్లపైనే ప్రవహిస్తున్నది. ఎండలు కాస్తున్నా రోడ్లపై తడి ఆరడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలో ఏళ్ల తరబడి కాలువలు లేకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు, పాలకులు వచ్చిన సమయంలో సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లినా చర్యలు లేవని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పంచాయతీకి సర్పంచ్ లేకపోవడంతో సమస్యలను ఎవరికి చెప్పుకోవాలా అర్థం కావడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, అధికారులు స్పందించి గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని లోవపాలెం గ్రామస్థులు కోరుతున్నారు.

విధి నిర్వహణలో చిత్తశుద్ధి చూపితే మంచి ఫలితాలు

▸▸ ప్రజా వేదికలో ఎమ్మెల్యే విజయకుమార్



ప్రజావేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక, జూలై 22 (ఆంధ్రజ్యోతి):అధికారులు, సిబ్బంది, ఉపాధి కార్మికులు విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనులు చేస్తే మంచి ఫలితాలు లభిస్తాయని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. గతంలో కాలువల్లో మట్టి తవ్వకం, తుప్పలు తొలగించడానికే పరిమితమైన ఉపాధి హామీ పథకం నేడు గ్రామాల్లో సీసీ, గ్రావెల్ రోడ్లు, భవనాల నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. చివరకు ఏ పని కావాలన్నా ఉపాధి నిధులపై ఆధార పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పూడికతీత, తుప్పలు తొలగింపు ద్వారా సాగునీటి కాలువలు శుభ్రం అయ్యాయని తెలిపారు. ప్రతి గ్రామంలో మొక్కలు విరివిగా నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం పనిచేయకుండా పేమెంట్లు, ఒకరికి బదులు మరొకరు పనిచేయడం, సీసీ రోడ్డు, కాలువ తవ్వకాల్లో కొలతల్లో లోపాలను డీఆర్పీలు నివేదిక ద్వారా చదివి వినిపించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మండలంలో 26 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు రూ.14కోట్లతో చేపట్టిన 400పైగా పనుల్లో లోటుపాట్లు సోషల్ ఆడిట్ నివేదిక ద్వారా వెలుగు చూశాయి. కార్మికులకు బకాయిలు చెల్లించాలని, పని వద్ద ఆరోగ్య భద్రత, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నాయకులు ప్లకార్డులు ప్రదర్శించారు. డ్వామా పీవో పూర్ణిమాదేవి మాట్లాడుతూ ఉపాధి కార్మికుల బకాయిలు త్వరలో ఖాతాలకు జమ అవుతాయని, ప్రాథమిక చికిత్స అందుబాటులో ఉంచుతున్నామని, పని సమయంలో ప్రమాదం జరిగితే రూ.5లక్షల వరకు బీమా ఉందని చెప్పారు. బినామి మస్టర్లు, ఒకరికి బదులు మరొకరు పనిచేసినా, తక్కువ పనిచేసి ఎక్కువ కొలతలు చూపిన వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, ఏపీవో శివ, ఎంపీడీవో ఎం.ఉషారాణి, ఎస్ఆర్‌పీ, డీవీవో, డీఆర్పీలు, కూటమి నాయకులు దొడ్డి శ్రీను, టెక్కలి పరశురాం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా : సుందరపు

రాంబిల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటుందని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని హరిపురంలో గల జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తన వెన్నంటే ఉన్న ప్రతి కార్యకర్తకు అన్నివిధాల న్యాయం చేస్తానన్నారు. ఎన్నో ఆటుపోటులను ఎదుర్కొని ఎమ్మెల్యేగా గెలిచానని, నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి ప్రభుత్వ సేవలు అందిస్తానన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలవడానికి తన కృషి చేసిన కార్యకర్తలను ఎన్నడూ విడిచిపెట్టనన్నారు. కార్యకర్తల రుణం తీర్చుకుంటానన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా ఈనెల 24న విడుదల అవుతుందని, సినిమాను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఎమ్మెల్యే విజయకుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు బైలపూడి శ్రీరామదాసు, పప్పల నూకన్నదొర, బొద్దపు శ్రీను, టెక్కలి పరశురాం, జనసేన నాయకుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలిఅడుగు జోరందుకోవాలి : ప్రగడ



మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు, చిత్రంలో పప్పల చలపతిరావు



గంటవానిపాలెంలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

ఎలమంచిలి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం మరింత జోరందుకోవాలని రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు ప్రతీ ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన పథకాలను వివరించాలన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం 45 శాతం వరకూ జరిగిందని, ఇంకా వేగవంతం చేయాలన్నారు. మండల పార్టీ అధ్యక్షులు ప్రతిరోజూ 2 నుంచి 4 గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులు, బూత్ ఇన్‌చార్జులు స్థానిక నేతలంతా సమిష్టిగా ఈ కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని, అబద్ధాలను ప్రజలకు వివరించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండూ సమపాళ్లల్లో ప్రజలకు అందిస్తూ ముందుకు పోతున్నామన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలిపేందుకు ముఖ్యమంత్రి అవిరళ కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టరు బీమరశెట్టి శ్రీనివాసరావు, యాదవ కార్పొరేషన్ డైరెక్టరు దూళి రంగనాయకులు, టీడీపీ మండల అధ్యక్షుడు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు కొలుకులూరి విజయ్‌బాబు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రాజన సూర్యనాగేశ్వరరావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గొర్లె నానాజీ, ఆడారి ఆదిమూర్తి, కరణం రవి పాల్గొన్నారు.

ప్రజల ఆశలకు అనుగుణంగా కూటమి పాలన

మునగపాక, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజలు ఆశలకు అనుగుణంగా కూటమి పాలన కొనసాగుతోందని, అమలవుతున్న సంక్షేమ పథకాలపై వైసీపీ నాయకులు విషం చిమ్ముతున్నారని గవర కార్పొరేషన్ డైరెక్టర్ బీమరశెట్టి శ్రీనువాసరావు అన్నారు. మండలంలో గంటవానిపాలెం గ్రామంలో మంగళవారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి ఇప్పటి వరకు ప్రభుత్వం అమలు చేసిన ఎన్టీఆర్ భరోసా, ఉచిత గ్యాస్, తల్లికి వందనం పథకాల గురించి వాకబు చేశారు. ఏమైనా సమస్యలుంటే చెప్పమని అడిగారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు కాండ్రేగుల శంకర్, ఉల్లింగల గోవింద, పెంటకోట శ్రీరామ్మూర్తి, సేనాపతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సస్యరక్షణతో నారుమడులలో తెగుళ్ల నివారణ



పాయకరావుపేట రూరల్: నామవరంలో రైతులకు సూచనలిస్తున్న దృశ్యం



రాంబిల్లి: పచ్చిరొట్ట సాగుపై రైతులకు సూచనలు చేస్తున్న ఏవో సుమంత

పాయకరావుపేట రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నారుమడులలో సమగ్ర సస్య రక్షణ ద్వారా తెగుళ్లను నివారించుకోవచ్చని కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీహరి అన్నారు. మండలంలోని నామవరం, పాయకరావుపేట గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారుమడికి తగినంత నీరు అందించాలన్నారు. అధిక నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి పి. ఆదినారాయణ మాట్లాడుతూ నారుమడిలో మొక్కలకు అవసరమైన పోషకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది శ్రావణ్‌కుమార్, టీడీపీ నాయకుడు కురందాసు శివ, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

రైతులు ఖరీఫ్ సీజన్‌లో పొలాల్లో ముందుగా పచ్చిరొట్ట ఎరువు సాగు చేసుకోవడం ద్వారా భూమిని సారవంతం చేసుకోవచ్చునని మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని గొరపూడి, వెల్చూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖరీఫ్‌లో వరి సాగుకు అవసరమైన ఎరువులు,పంట సాగులో మెలకువలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీనివాస్, కుమారి, హేమ, కనకరత్నం, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని సర్వసిద్ధి గ్రామంలో మంగళవారం ఏవో సౌజన్య ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో గ్రామంలో నారుమడులను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో సౌజన్య మాట్లాడుతూ నారు మడుల యాజమాన్యంతోపాటు నీరు లేక ఎండుతున్న నారుమళ్లలో రక్షణ చర్యలు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కురందాసు గణేష్, టీడీపీ సీనియర్ నాయకుడు పి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల పట్ల బాధ్యతగా మెలగాలి

▸▸ ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి



తిమ్మరాజుపేటలో అంగన్‌వాడీ-2 కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీడీ సూర్యలక్ష్మి

మునగపాక, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పిల్లల పట్ల ఎంతో బాధ్యతగా మెలగాలని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. మండలంలో తిమ్మరాజుపేటలో అంగన్‌వాడీ-2 కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలో పిల్లలకు మంచిచెడులు తెలియవని, వారితో సున్నితంగా ఉండాలన్నారు. ప్రభుత్వం అందించే పోషకాలను అందివ్వాలని, వాటిని అందజేయడంలో చేతివాటం చూపితే చర్యలు తప్పవన్నారు. విద్యార్థులకు ఇచ్చే ఆహారం, బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఐసీడీఎస్ సీడీపీవో ఇందిరాదేవి, సూపర్‌వైజర్ అన్నపూర్ణ ఉన్నారు.

కనకమ్మను దర్శించుకున్న ధర్మశ్రీ



అమ్మవారిని దర్శించుకున్న కరణం ధర్మశ్రీ, నాయకులు

ఎలమంచిలి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి ధర్మవరంలోని కనకమహాలక్ష్మి అమ్మవారిని మంగళవారం వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, స్థానిక నాయకులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సంప్రదాయ రీతిలో ఆయనకు స్వాగతం పలికారు. మునిసిపల్ వైస్ ఛైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరైపు గుప్తా, బొద్దపు యర్రయ్యదొరలు ఆయన వెంట ఉన్నారు. అనంతరం ధర్మవరంలోని రాజకీయ నేపథ్యం ఉన్న కొఠారు కుటుంబీకులను కలిసి వారి ఆశీస్సులను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో దూది నరసింహమూర్తి, నాలుగు మండలాలకు చెందిన నేతలు పాల్గొన్నారు.

ధర్మవరం అగ్రహారం పాఠశాలను సందర్శించిన ఎంఈవో

ఎస్.రాయవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈవో-2 శ్రీరామమూర్తి సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈవో విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు. అనంతరం శ్రీరామమూర్తి పాఠశాలకు చెందిన పలు రికార్డులను తనిఖీ చేసి, హెచ్ఎంకు పలు సూచనలు చేశారు.

కేరళ మాజీ సీఎంకు సీపీఎం నివాళి

మునగపాక, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్.అచ్యుతానందన్ మరణం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎస్‌బీఐ వద్ద అచ్యుతానందన్ చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, ఎస్.బ్రహ్మాజీ, ఎంపీఎస్.నారాయణ, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

సంతపాలెంలో ఘనంగా పైడితల్లి జాతర

రాంబిల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్చూరు పంచాయతీ సంతపాలెం గ్రామంలో పైడితల్లి అమ్మవారు జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని స్థానికులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించి పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణం తీన్‌మార్ డప్పులతో దద్దరిల్లింది.

సచివాలయ ఉద్యోగులకు ఘన సన్మానం



బదిలీపై వెళుతున్న ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

కోటవురట్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది చేసిన సేవలు అభినందనీయమని రాజుపేట సర్పంచ్ బొడ్డేటి వెంకటరమణ అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శి డీఎల్ నర్సింహం ఆధ్వర్యంలో రాజుపేట సచివాలయంలో పని చేసి బదిలీ అయిన ఉద్యోగులను పంచాయతీ పాలకవర్గం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటరమణ మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వర్తించిన ఉద్యోగికి ఎల్లప్పుడు ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. బదిలీపై వెళుతున్న వై.దాసుకుమార్, గుడివాడ మహేశ్వరి, మునసాల మౌనిక, పినిపాత్రుని పవన్‌రాజ్‌ను సన్మానించారు.

బల్క్‌డ్రగ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలి

నక్కపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆగస్టు ఆరో తేదీన బల్క్‌డ్రగ్‌పై చేయనున్న ప్రజాభిప్రాయ సేకరణను రద్దుచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం రాజయ్యపేట గ్రామంలో బల్క్‌డ్రగ్ పార్కుకు ఏర్పాటుపై నిరసన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలకు, మత్స్యకారుల జీవనోపాధికి నష్టం కల్గించే బల్క్‌డ్రగ్ పార్కును కాకినాడ జిల్లా తొండంగి ప్రాంతంలో ప్రజలు వ్యతిరేకించారన్నారు. కార్యక్రమంలో మహేశ్‌బాబు, కార్యదర్శి ఎం.మహేశ్, జీ కాశీరావు, కోడా కాశీరావు, కారే భూలోక, బొంది నూకరాజు, మైలపల్లి కాశీ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ రత్నభరత్

పాయకరావుపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాయకరావుపేటకు చెందిన ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ బి.రత్నభరత్ నియమితులయ్యారు. బీజేపీ యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా, పీఎంజేకేకేవై రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేసి పార్టీ అభివృద్ధి కృషిచేసిన ఆయన సేవలను అధిష్ఠానం గుర్తించి జిల్లా ప్రధాన కార్యదర్శి పదవిని అప్పగించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృత ప్రచారం చేయడం ద్వారా పార్టీ బలోపేతానికి తన వంతు కృషిచేస్తానని తెలిపారు.

ఘనంగా గణితంలో పై దినోత్సవం

ఎస్.రాయవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవుపోలవరం జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం గణితంలో పై దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం అరుణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గణితంలో చక్కగా రాణించాలన్నారు. గణిత ఉపాధ్యాయిని స్వర్ణగౌరీ మాట్లాడుతూ గణితంలో పై అనేది వృత్తం చుట్టు కొలతను, దాని వ్యాసం మధ్య నిష్పత్తిని సూచిస్తుందన్నారు. అలాగే పై అనేది గ్రీకు అక్షరమని, దీని ఉజ్జాయింపు విలువ 22/7 అని ఆమె వివరించారు. అంతేకాకుండా గణితాన్ని అభ్యసించడం, నేర్చుకోవడం వలన జీవితంలో ఎదురయ్యే సమస్యలను సులువుగా పరిష్కరించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్ని జిల్లాల్లోనూ బీసీ భవనాలు

- వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం సర్వ నాశనం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

అనకాపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని జిల్లాలోనూ బీసీ సంక్షేమ భవనాలు నిర్మిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. వైసీపీ గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో సర్వనాశనమైందని ఆరోపించారు. మంగళవారం అనకాపల్లి జిల్లాలో పర్యటనకు వచ్చిన ఆమె స్థానిక పెంటకోట కన్వెన్షన్ హాలులో టీడీపీ నియోజకవర్గ నాయకులతో జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సీఎం చంద్రబాబు మహిళా పక్షపాతి అన్నారు. బీసీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లో బీసీ సంక్షేమ భవనాలు ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్ర భవిష్యత్‌కు సీఎం చంద్రబాబు ఒక దిక్సూచిగా అభివర్ణించారు. మహిళలను వ్యాపారవేత్తలుగా చేయాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు, మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో లక్ష మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి, వారికి మిషన్‌లు పంపిణీ చేస్తున్న ఘతన కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు.

జగన్ బడుగు, బలహీన వర్గాల ద్రోహి అని మంత్రి సవిత ఆరోపించారు. పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్‌లను జగన్ ప్రభుత్వం ఎత్తివేస్తే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పునఃప్రారంభించి పేదల ఆకలి తీర్చుతున్నట్టు చెప్పారు. జగన్‌రెడ్డి ఒక్క చాన్స్ కావాలని అధికారాన్ని చేజిక్కించుకొని రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. మద్యం కుంభకోణంలో వైసీపీ నాయకులు మునిగిపోయారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ వెనుకబడిందన్నారు. మంత్రి లోకేశ్ విద్యా రంగంలో అనేక మార్పులు తీసుకొస్తున్నారన్నారు. విశాఖకు అనేక ఐటీ పరిశ్రమలు తీసుకురావడమే కాకుండా స్థానిక యువత భవిష్యత్తులో ఉద్యోగాల కోసం ఎక్కడికీ వెళ్లకుండా విశాఖను ఐటీ హబ్‌గా మార్చుతున్నామని మంత్రి చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను కార్యకర్తలు గ్రామ స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, విశాఖ జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు, అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి, అర్బన్, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, అనకాపల్లి నియోజకవర్గ పరిశీలకుడు గంటా నూకరాజు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, ఏఎంసీ చైర్మన్ పచ్చికూర రాము, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, అనకాపల్లి, కశింకోట మండలాల టీడీపీ అధ్యక్షులు బాబి, మురళి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




సమావేశానికి హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు... మాట్లాడుతున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల, పక్కన డీఎంహెచ్‌వో

క్వారీ ప్రభావిత ప్రాంతాల్లో స్క్రీనింగ్ పరీక్షలు

- ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

తుమ్మపాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): క్వారీ ప్రభావిత ప్రాంతాల్లో ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. మండలంలోని సీహెచ్‌ఎన్ అగ్రహారంలో మంగళవారం ఉచిత స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించి వైద్యాధికారులు, రోగులతో మాట్లాడారు. క్వారీ ప్రభావిత ప్రాంతాల్లో కిడ్నీ ప్రజలు వ్యాధుల బారిన పడుతుండడంతో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్య సదుపాయాలు అందిస్తామన్నారు. సీరం క్రియేటిన్, హిమోగ్లోబిన్, ఆర్‌బీఎస్ తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వైద్యాధికారులు కిడ్నీ వ్యాధిగ్రస్థులపై ప్రత్యేక శ్రద్ధను చూపిస్తూ తగిన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి హైమావతి, వైద్యాధికారులు ఊహాప్రియ, వాణి జగదీశ్వరి, వైద్య సిబ్బంది, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి సవితకు చిత్రపటం బహూకరణ



మంత్రి సవితకు చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కొత్తూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ కార్యాలయాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత మంగళవారం సందర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిసారిగా అనకాపల్లికి వచ్చిన ఆమె, ముందుగా రింగురోడ్డులోని కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో భేటీ అయ్యారు. నియోజకవర్గంలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సవితను సత్కరించి కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాగజగదీశ్వరరావు

అనకాపల్లి టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎమ్మెల్సీ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 84వ వార్డు పరిధిలోని నెయ్యిలవీధిలో మంగళవారం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బుద్ద మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల్లో ఆనందం వెల్లివిరిస్తున్నదన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఇప్పటికే అమలులోకి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రేపాక ఈశ్వర అప్పారావు, శ్రీకాకుళం గణపతి, చింతపల్లి నరసింహమూర్తి, బోడి వెంకటరావు, పిళ్లా తారకేసు, మళ్ల గణేశ్ పాల్గొన్నారు.

దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి



బంగారం వర్తకులతో మాట్లాడుతున్న సీఐ విజయ్‌కుమార్

అనకాపల్లి టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముఖ్య కూడలి, బంగారం దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం పోలీస్ అతిథి గృహ సమావేశ మందిరంలో పట్టణంలోని బంగారం దుకాణాల యజమానులతో మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఇటీవల కాలంలో జరుగుతున్న దొంగతనాలకు సంబంధించి యజమానులతో మాట్లాడారు. అనుమానితులు ఎవరైనా బంగారం అమ్మకాలకు వస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి దుకాణాల భద్రతకు చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు.

శ్రావణ మాసోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

కొత్తూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలోని రింగురోడ్డులో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో సంతోషిమాత శ్రావణ మాసోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ నెల 25 నుంచి ఆగస్టు 22 వరకు జరగనున్న శ్రావణమాస శుభ మహోత్సవాల సందర్భంగా జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, నాయకులు హేమగిరి సత్యనారాయణస్వామి, ఆలయ చైర్మన్ అప్పికొండ గణేష్, సంతోషిమాత ఆలయ చైర్మన్ మారిశెట్టి భాస్కరరావు పాల్గొన్నారు.

నర్సింగబిల్లి పశు వైద్యశాలలో రికార్డుల తనిఖీ



వైద్యశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డీడీ

కశింకోట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగబిల్లి పశు వైద్యశాలలో ఆ శాఖ ఉప సంచాలకుడు ఎం.చంద్రశేఖర్ మంగళవారం రికార్డులను తనిఖీ చేశారు. అన్ని రికార్డులు, స్టాక్ పుస్తకాలు, వైద్యసేవల నమోదు వివరాల పత్రాలను సమీక్షించారు. ప్రస్తుతం అమలులో ఉన్న థైలియాసిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమం, మేకలు, గొర్రెల్లో డీవార్మింగ్ కార్యక్రమం గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులకు సెక్స్ సార్టెడ్ వీర్యం వాడకం, ప్రయోజనాలు, లభ్యతపై అవగాహన కల్పించాలని డీడీ సూచించారు. అనంతరం వైద్యశాల పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారిణి డాక్టర్ ఆల్ఫోన్సా జార్జ్, సిబ్బంది పాల్గొన్నారు.

కల్తీ మద్యం తయారీ సూత్రధారి ఎవరో చెప్పండి

- రెండు రోజుల్లో పోలీసులు వివరించాలి
- ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొత్తకాలనీ కేంద్రంగా చేపట్టిన కల్తీ మద్యం తయారీ సూత్రధారి ఎవరో ఎక్సైజ్, పోలీస్ శాఖలు ప్రజలకు చెప్పాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. పరవాడలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్పిరిట్‌తో తయారీ చేసిన మద్యాన్ని బెల్టు షాపులకు సరఫరా చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన వ్యక్తులు ఎవరో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. ఈ వ్యవహారంలో ప్రజలకు చాలా అపోహలు ఉన్నాయన్నారు. కల్తీ మద్యం సూత్రదారులెవరో రెండు, మూడు రోజుల్లో తెలియజేయాలన్నారు. అలా జరగని పక్షంలో ఈ వ్యవహారాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు. గ్రామాల్లో బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని, వీటిని పూర్తి స్థాయిలో అరికట్టాలని ఆయన సూచించారు. దాబాల్లో మద్యం అమ్మకాలు జరపకుండా చర్యలు చేపట్టాలని, మద్యం దుకాణాల యజమానులు తప్పనిసరిగా సమయపాలన పాటించేలా చూడాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ లూజు అమ్మకాలు జరపొద్దని స్పష్టం చేశారు. బొగ్గు, ఫ్లయాష్‌తో రాకపోకలు సాగిస్తున్న లారీల యాజమాన్యాలు నిబంధనలు పాటించి తీరాలన్నారు. పరిమితికి మించి లోడ్‌లతో రాకపోకలు సాగించడం వలన రహదారులు దెబ్బతినడంతో పాటు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భూ నిర్వాసితులకు ఫార్మాసిటీలో ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యతను పరిశ్రమల యజమాన్యాలు, రాంకీ, జేఎస్‌పీసీ అసోసియేషన్‌లు తీసుకోవాలన్నారు. ఫార్మా కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామం తరలింపు ప్రక్రియ కొనసాగుతుందని ఎమ్మెల్యే వెల్లడించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

పరవాడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా వరి పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు సుబ్రహ్మణ్యం చెప్పారు. కలపాక పంచాయతీ పరిధిలోని స్వయంభూవరంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువుల ప్రాధాన్యత, కాలిబాటలు తీయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. వరి ఆకుమడి దశలో చీడపీడలు వ్యాపిస్తే నివారణకు 5 ఎంఎల్ వేపనూనెతో కార్బండిజమ్ కలిపి ఉన్న మందును రెండు గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవోలు రమాదేవి, విజేత, ఏఈవోలు ఎంఎస్ మూర్తి, శ్రీను, వీపీఏ గౌతమి, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో ఖర్చు ఆదా

కశింకోట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించి సాగు ఖర్చు తగ్గించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి స్వప్న సూచించారు. మండలంలోని చెరకాం, తీడ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. చెరకు, బొప్పాయి, అరటి పొలాల్లో దశపర్ని కషాయం, అగ్నాస్త్రం, మీనామృతం స్ప్రే రైతులతో చేయించారు. కషాయాలు, పలు రకాల పండ్ల మొక్కలను పరిశీలించి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో సుందరయ్యపేట ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం నిర్వాహకులు అరుణ, ఇన్‌చార్జి అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై అవగాహన పెంచుకోండి

కొత్తూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వరిలో విత్తన శుద్ధిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి పి.బి.రంగాచారి అన్నారు. మంగళవారం ఆయన వెంకుపాలెం, సీతానగరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు సాగులో తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించే లక్ష్యంగా పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి వరి నారుమడుల్లో జింక్ లోపం వస్తుందని, దీని నివారణకు లీటర్ నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ మందు స్ప్రే చేయాలని చెప్పారు. అంతేగాకుండా నాలుగు సెంట్లు నారుమడికి 2 కేజీల ముడి జింకు, రెండు కిలోల ఇసుకలో కలిపి వేయాలన్నారు. దీనివల్ల భూసారం పెంపొందుతుందన్నారు. ఖరీఫ్‌లో వ్యవసాయ యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. అనంతరం కౌలు రైతులకు కార్డుల గురించి చెప్పారు. కార్యక్రమంలో ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా వసతిగృహం ఏర్పాటుచేయాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

అనకాపల్లి టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో మరొక ప్రభుత్వ బీసీ మహిళా వసతిగృహం ఏర్పాటు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం అనకాపల్లికి వచ్చిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితను వినతిపత్రం అందించారు. జిల్లాలోని మారుమూల గ్రామాల నుంచి అనకాపల్లిలో చదువుకోవడానికి ఎంతో మంది విద్యార్థినులు వస్తున్నారని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.బాబ్జి, జి.ఫణేంద్ర కుమార్ మంత్రికి వివరించారు. ఇక్కడ ఒకే మహిళా వసతి గృహంలో సామర్థ్యాన్ని మించి విద్యార్థినులు ఉంటున్నారన్నారు. అందువల్ల మరో వసతిగృహాన్ని ఏర్పాటుచేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఏఐవైఎఫ్ నాయకులు వి.రాజు, జగదీశ్, సింహాద్రి తదితరులు ఉన్నారు.

'హరిహర వీరమల్లు' విజయం సాధించాలని పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం విజయవంతం కావాలని పరవాడ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మంగళవారం ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా సినిమాను ప్రమోట్ చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, ఎం.అప్పలనాయుడు, సర్పంచులు ఎస్.అప్పలనాయుడు, బి.శ్రీనివాసకాసులు, బి.రామగోవిందరావు, కె.వెంకటరమణ, వియ్యపు చిన్న, బి.అయ్యబాబు, వి.అనిల్, రామచంద్రరావు, హరిబాబు, పరదేశినాయుడు పాల్గొన్నారు.

సబ్బవరంలో...

సబ్బవరం: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా విజయం సాధించాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పవన్ కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అభిమానులు, కార్యకర్తలు బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది పోరాట యోధుడి కథాంశంతో రూపుదిద్దుకున్న సందేశాత్మక చిత్రం కావడంతోనే ఈ సంబరాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.వెంకటేశ్వరరావు, ఇందలి రమణ, ఎస్.వెంకటేశ్వరరావు, బి.స్వామి నాయుడు, కె.వెంకటరమణ, ఉగ్గిన రాము, ఎస్.శ్రీను, బి.రామారావు, కర్రి కనకరాజు, దుర్గాప్రసాద్, గొర్లి కుమార్, బి.పద్మ, శేఖర్, జెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

అచ్యుతానందన్‌కు ఘన నివాళులు




అచ్యుతానందన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సీపీఎం ఆవిర్భావ నేత, కేరళ మాజీ సీఎం వీఎస్ అచ్యుతానందన్ మృతికి సీపీఎం నాయకులు నివాళులర్పించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం అచ్యుతానందన్ చిత్రపటానికి నాయకులు గంటా శ్రీరామ్, కె.తేలయ్యబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ అచ్యుతానందన్ ఎనిమిదిన్నర దశాబ్దాలకుపైగా ఉద్యమ జీవితానికే అంకితమయ్యారని కొనియాడారు. కేరళలో కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధిలో ఆటుపోటులను దగ్గరగా చూసిన యోధుడన్నారు. 17 ఏళ్ల వయసులో కమ్యూనిస్టు పార్టీలో చేరి ఎనలేని సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.ఉమామహేశ్వరరావు, కె.ఈశ్వరరావు, పి.చలపతి, ఎన్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ: సీపీఎం సీనియర్ నేత అచ్యుతానందన్ మృతికి సీఐటీయూ నాయకులు సంతాపం తెలిపారు. తొలుత అచ్యుతానందన్ చిత్రపటానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. కేరళలో కమ్యూనిస్టు ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన నాయకుల్లో అచ్యుతానందన్ ఒకరని ఆయన గుర్తు చేశారు. పోరాట యోధుడుగా, ప్రజా నాయకుడుగా అచ్యుతానందన్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.నాయుడు, పి.అప్పారావు, జి.శ్రీను, నాయుడు, సత్తిబాబు పాల్గొన్నారు.

పనులు ఎప్పటికప్పుడు పూర్తిచేయండి: జడ్సీ చక్రవర్తి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్సీ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి స్పష్టం చేశారు. స్థానిక ఎస్ఆర్ శంకరన్ నిలయంలో మంగళవారం వార్డు సెక్రటరీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యదర్శుల పనితీరు ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని చెప్పారు. అంతేకాకుండా సెక్రటరీల పనితీరుపై ఎప్పటికప్పుడు సచివాలయాల వారీగా సమావేశాలు నిర్వహిస్తామని, విధుల నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎస్‌ఈ కె.శ్రీనివాసరావు, టీపీవో కె.వెంకటరావు, డీఈఈ వేణుగోపాల్, ఏపీడీ వై.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

25 నుంచి శ్రావణమాసం పూజలు

సబ్బవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సబ్బవరం దుర్గమాంబ ఆలయంలో ఈ నెల 25 నుంచి శ్రావణమాసం పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 25న సామూహిక కుంకుమార్చనలు, ఆగస్టు 1న అమ్మవారికి గాజులు ఆలంకరణ, 8న సాయంత్రం వరలక్ష్మీ దేవి వ్రతం, కుంకుమార్చన, బంగారు వెండి పుష్పాలతో అమ్మవారికి పూజా కార్యక్రమాలు, 15న అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకాలు, 22న సారె ఊరేగింపు తదితర కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

జడ్సీని కలిసిన వార్డు కార్పొరేటర్లు

అనకాపల్లి టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో మంగళవారం జోనల్ కమిషనర్ కె.చక్రవర్తిని 82, 83 వార్డుల కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్నలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జడ్సీని సత్కరించారు. అలాగే వార్డులో సమస్యలు పరిష్కరించడంలో సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మందపాటి జానకిరామరాజు, జాజుల రమేశ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి కుటుంబానికి సాయం

తుమ్మపాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని మార్టూరులో పదో తరగతి 2005-06 బ్యాచ్ విద్యార్థి ముసిలి శ్రీనివాసరావు కుటుంబానికి మార్టూరు ఎంఆర్‌పీ బ్యాచ్ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. శ్రీనివాసరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అతని కుటుంబానికి రూ.45 వేలు, 75 కిలోల బియ్యం మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మార్టూరు గ్రామ నాయకుడు కరణం నూకనాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. తోటి విద్యార్థి కుటుంబానికి తోడ్పాటు అందించడం ఆనందకరమన్నారు. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలపై అవగాహన

కశింకోట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జాన్స్ పాఠశాలలో ఎన్‌డీఏ, యూపీఎస్‌ఈపై లెఫ్టినెంట్ కమాండర్ నీరజ్‌కుమార్ మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్కూలు హెడ్ గర్ల్, హెడ్ బాయ్, గ్రూపు కెప్టెన్, వైస్ కెప్టెన్‌ల నియామకం జరిగింది. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు లక్ష్య సాధనకు చేయాల్సిన కృషిని వివరింఆరు. ముందుగా లెఫ్టినెంట్ కమాండర్ నీరజ్‌కుమార్‌కు విద్యార్థులు కవాతుతో గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బత్తుల నోబుల్‌కుమార్, స్కూలు కరస్పాండెంట్ బత్తుల అనురాధ, ప్రిన్సిపాల్ రూపానంది తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి రాజరాజేశ్వరి ఆలయ వార్షికోత్సవాలు

పరవాడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీలోని రాంకీ కమర్షియల్ హబ్ కూడలిలో రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలను ఈ నెల 25 నుంచి నిర్వహించనున్నట్టు ఫార్మాసిటీ యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. 25న ఆలయ ప్రదక్షిణ, గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, మూలమంత్ర హోమాలు, ధ్వజారోహణ, దీక్ష ధారణ చేయనున్నట్టు పేర్కొన్నారు. అలాగే 26, 28 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలు, విశేష పూజలు ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

ఉద్యోగం పేరుతో మోసగించిన వ్యక్తిపై కేసు

అనకాపల్లి టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ సంతోశ్‌కుమార్ తెలిపారు. కశింకోట కస్పావీధికి చెందిన రిటైర్డు ఆర్మీ ఉద్యోగి మిత్తాన రాజు అల్లుడుకి బెంగళూరు 'బెల్' కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి గవరపాలేనికి చెందిన మద్దాల దివాకర్ 2022లో రూ.4 లక్షలు తీసుకున్నాడన్నారు. ఉద్యోగం గురించి ప్రశ్నించగా.. మాయమాటలు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నాడన్నారు. మూడేళ్లు దాటినా ఉద్యోగం రాకపోవడంతో దివాకర్ తమను మోసం చేసినట్టు సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

వాడీవేడిగా ముంచంగిపుట్టు మండల సమావేశం

» ఉపాధ్యాయులులేక మూతపడిన

పాఠశాలలను తెరవాలని సభ్యులు డిమాండ్



ఎంఈఓను నిలదీస్తున్న ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

ముంచంగిపుట్టు, జులై 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ఎంపీపీ ఎ.సీతమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సభ్యులు పలు సమస్యలపై ధ్వజమెత్తారు. విద్యా సంవత్సరం ప్రారంభమై సుమారు నెల రోజులుదాటుతున్నా మండలంలో సుమారుగా 41 పాఠశాలలు నేటికీ మూతపడే ఉన్నాయని, బదిలీ అయిన ఉపాధ్యాయుల స్థానంలో కొత్తవారిని ఎందుకు నియమించలేదని ఎంఈవో కృష్ణమూర్తిని సభ్యులు నిలదీశారు. నెలరోజులుగా పాఠశాల లు తెరవకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమమవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. వెంటనే పాఠశాలలు తెరుచుకునేలా చూడాలని కోరారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో కొన్ని నెలలుగా గర్భిణులకు ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు నిర్వహించడంలేదని ఆరోపించారు.అలాగే, వైద్యులు సమయపాలన పాటించడంలేదని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ గీతాంజలిని ప్రశ్నించారు. ఆ స్పత్రి గత ఏడాది మంజూరైన అభివృద్ధి నిధులు ఎంత ఖర్చు చేశారని ఆమె అడిగారు. దీంతో స్పందించిన ఆమెఆస్పత్రి కమిటీ ఆమోదం మేరకు నిధులు ఖర్చు చేసినట్టు సమాధానమిచ్చారు. లబ్బూరు, కిలగాడ పీహెచ్‌సీల పరిధిలో జ్వరాల తోపాటు పలు రకాల వ్యాధులు విజృంభిస్తున్నాయని, గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆయా పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్యాం ప్రసాదు, శిరీషలకు స భ్యులు సూచించారు. మండల కేంద్రంతో పాటు సుమారు 12 గ్రామాలను కలుతూ సుమారు రూ.3. 50 కోట్లతో ఏర్పాటు చేసిన తాగునీటి పథకం ఆశించిన స్థాయిలో పని చేయడంలేదని, దీంతో గిరిజనులు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని సీడీపీవోను కోరారు. ఆర్అండ్‌బీ ప్రధాన రహదారులు మరమ్మతులు చేపట్టాలన్నారు. ఇళ్ల బిల్లుల చెల్లింపుల్లో చేతివాటం చూపించకుండా చూడాలని సభ్యులు హౌసింగ్ అధికారులకు కోరారు. ఎవో మురళీకృష్ణ మాట్లాడుతూ ఖరీఫ్‌కు రాయితీ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అలాగే వెలుగు, రెవెన్యూ, జీసీసీ, సీఆర్, ఉపాధి హామీ పథకం, హార్టికల్చర్ తదితర శాఖల అధికారులను పలు సమస్యలపై సభ్యులు నిలదీశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి, పీఆర్ ఏఈ మురళీ కృష్ణ, జీసీసీ మేనేజర్ కుమారస్వామి, సీడీపీడవో విమలకుమారి, ఏపీఎం కళావతి, అధికారులు పాల్గొన్నారు.

కళాశాల భవనాల మరమ్మతుకు కృషి

జి.మాడుగుల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ కళాశాల భవనాల మరమ్మతులకు కృషి చేస్తున్నట్టు మండల పెసా కమిటీ అధ్యక్షుడు లకే రామకృష్ణ తెలిపారు. మంగళవారం పెసా కమిటీ బృందం కళాశాలను సందర్శించారు. శిథిలావస్థకు చేరిన కళాశాల భవనం, మరుగుదొడ్లు, వంట గదులతో తలెత్తుతున్న ఇబ్బందులను గుర్తించారు. ఈ నేపథ్యంలో సంబంధింత ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్లు కళకళ

» రెండు రోజులుగా వర్షాలు



నీటితో నిండుగా ఉన్న లుబ్బుర్తి జలాశయం

కొయ్యూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలాశయాలు, చెరువులకు జలకళ వచ్చింది. వరినారు మడులు జీవం పోసుకున్నాయి. ఖరీఫ్ సాగుకు ఇబ్బందులు తొలగాయి. పదిరోజుల కిందటి వరకు మండలంలో అడుగంటుతూ కనిపించిన లుబ్బుర్తి, గింజర్తి, నగరం జలాశయాలు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు చేరింది. కనీసం ఊటనీరుకూడా లేకుండా వెలవెలపోయిన మల్లికార్జునస్వామి, కాట్రగెడ్డ, శరభన్నపాలెం, గాంకొండ తదితర చెక్‌డ్యామ్‌ల నుంచి ప్రస్తుతం వరదనీరు ప్రవహిస్తోంది. 20 రోజుల క్రితం వేసిన వరినారు మడులు ఇటీవల కాసిన ఎండలకు ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ స్థితిలో సోమ, మంగళవారాల్లో కురిసిన వర్షానికి వరినారు మడులు జీవకళతో కనిపిస్తున్నాయి. రైతాంగం దమ్ములకు సమాయిత్తమవుతున్నారు.



వర్షాలకు జీవం పోసుకున్న వరినారు

హుకుంపేట వైస్ ఎంపీపీ రాజీనామా

హుకుంపేట జూలై 22 (ఆంధ్రజ్యోతి); మండల పరిధిలోని గుడా సిగ్మెంట్ ఎంపీటీసీ సభ్యురాలు, వైస్ ఎంపీపీ ప్రియాంక తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు మంగళవారం విశాఖ జిల్లా పరిషత్ అధికారికి రాజీనామా పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ పరంగా ఎటువంటి నిధులు మంజూరు కావడంలేదన్నారు. ఈ స్థితిలో ప్రజలకు న్యాయం చేయలేక తమ సొంత నిధులతో తన పరిధిలో కొంతమేర అభివృద్ధి పనులు చేసినట్టు ఆమె తెలిపారు. అలాగే, వ్యక్తిగత కారణాలతోనూ రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు.



జడ్పీ అధికారికి రాజీనామా పత్రం అందిస్తున్న వైస్ ఎంపీపీ ప్రియాంక

గిరిజన యువతకే శతశాతం ఉద్యోగాలు కల్పించాలి

» ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్‌కు టీడీపీ సర్పంచులు వినతి



ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ సదా భార్గవికి వినతిపత్రం అందిస్తున్న టీడీపీ సర్పంచ్‌లు

పాడేరురూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ప్రాంతంలో అన్ని రకాల ఉద్యోగాలు శతశాతం గిరిజనులకే ఇచ్చే విధంగా ప్రభుత్వానికి నివేదికను ఇవ్వాలని తెలుగుదేశం పార్టీకి చెందిన పంచాయతీ సర్పంచులు ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ సదా భార్గవిని కోరారు. ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో డాక్టర్.ఎంజె అభిషేక్ గౌడ అధ్యక్షతన ఐటీడీఏలో మంగళవారం జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆమెను కలిసి వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ డివిజన్ నాయకులు, దారెల పంచాయతీ సర్పంచ్ పాంగి పాండురంగస్వామి మాట్లాడుతూ జీవో 3ను వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడంతో గిరిజన నిరుద్యోగులు ఉపాధి అవకాశాలను కోల్పోతున్నారన్నారు. ఎన్టీఆర్ హయాంలో 275 జీవో, చంద్రబాబు హయాంలో జీవో 3లను అమలు చేసి గిరిజన నిరుద్యోగ యువతకు శతశాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. ప్రస్తుతం ప్రజాభిప్రాయ సేకరణకు సంబంధించి ఆదివాసీల పక్షాన నివేదికను అందిస్తే కూటమి ప్రభుత్వానికి మంచిపేరు గుర్తింపు వస్తుందన్నారు. గిరిజన నిరుద్యోగ యువతకు న్యాయం జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణరాజు, అండిభ, శోభకోట, మఠం సర్పంచ్‌లు తామర్ల సత్యనారాయణ, పలాసి శశిభూషణం నాయుడు, మఠం శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్‌కు సాదర స్వాగతం

పాడేరురూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): జీవో నెంబర్ 3పై ప్రజాభిప్రాయ సేకరణకు మంగళవారం పాడేరు ఐటీడీఏ కార్యాలయానికి వచ్చిన రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ సదా భార్గవిని టీడీపీ పాడేరు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఐటీడీఏలో నిర్వహించిన జీవో 3, గిరిజన చట్టాలపై జరిగిన సమావేశంలో ఈశ్వరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డప్పోడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి రాముని పరామర్శిస్తున్న ఈశ్వరి

చింతపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడుగుమామిడి గ్రామానికి చెందిన టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి రాము భార్య ఆమని అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. దీంతో మంగళవారం ఉదయం టీడీపీ పాడేరు నియోజక వర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి, రాష్ట్ర బీసీసెల్ అధ్యక్షులు పొలుపర్తి గోవింద్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. భర్త రాముకి సానుభూతికి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఈశ్వరి మాట్లాడుతూ ఆమని పార్టీలో కార్యకర్తగా పనిచేశారని, అలాంటి ఆమె దూరం కావడం చాలా బాధాకరమన్నారు.ఈకార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

మందులతో క్షయ నయం



సన్యాసంపాలెంలో రోగులతో మాట్లాడుతున్నా జిల్లా అధికారి

హుకుంపేట జూలై 22 (ఆంధ్రజ్యోతి); క్షయపై ఎవరూ భయందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ వ్యాధి నివారణకుమందు లున్నాయని క్షయ జిల్లా ప్రోగాం మేనేజ్‌మెంట్ అధికారి డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు మంగళవారం మండలంలోని స న్యాసంపాలెం, గడికించుమండ గ్రామాలను సందర్శించి క్షయ రోగులతో మాట్లాడారు. వారు వాడుతున్న మందులుపరిశీలించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ సదానందం, ల్యాబ్ టెక్నీషియన్ నాగేశ్వరరావు ఎంఎల్‌హెచ్‌పీ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలిగా రాజేశ్వరి



గూడెంకొత్తవీధి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులుగా జీకేవీధి ఎంపీటీసీ సభ్యురాలు రీమల రాజేశ్వరిని నియమిస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.

ఉపాధి వేతనాలు విడుదల చేయాలి: గిరిజన సంఘం

ముంచంగిపుట్టు, జులై 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి వేతనాలు విడుదల చేయాలని గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం.ఎం.శ్రీను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం గిరిజనసంఘం ఆధ్వర్యంలో కర్రిముఖిపుట్టు పంచాయతీకి చెందిన ఉపాధికూలీలు బకాయి వేతనాలు అందించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి, ఏపీవో వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గిరిజనసంఘం నేత శ్రీను మాట్లాడుతూ కర్రిముఖిపుట్టు పంచాయతీలో 18 గ్రామాలకు చెందిన ఉపాధి కూలీలకు 3 నెలలుగా సుమారు రూ.60 లక్షలకుపైగా ఉపాధి వేతనాలు చెల్లింపులు జరగలేదని అన్నారు. కార్యక్రమంలో సంఘం నేతలు త్రినాథ్, జీనబంధు, నారాయణ, సీతారామ్ పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ ఉద్యోగులకు సన్మానం

చింతపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోతుగెడ్డ గ్రామ సచివాలయం నుంచి పొరుగు మండలాలకు బదిలీపై వెళుతున్న ఉద్యోగులను టీడీపీ సీనియర్ నేత, సర్పంచ్ చింతర్ల సునీల్, పంచాయతీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కార్యదర్శి రవి కుమార్, ఎంపీటీసీ సభ్యుడు బాబూరావు పాల్గొన్నారు.

కంపుమానుపాకలులో పశువైద్యశిబిరం

» 84మేకలు, గొర్రెలకు చికిత్స

» 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



మేకలకు చికిత్స అందిస్తున్న పశుసంవర్థకశాఖ సిబ్బంది

గూడెంకొత్తవీధి, జూలై 22 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కంపుమానుపాకలు గ్రామంలో ప్రత్యేక పశువైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. 84 మేకలు, గొర్రెలకు వైద్యాధికారి లోకుల రమేష్ చికిత్స చేశారు. గ్రామంలో గొర్రెలు, మేకలు నోరు, ముక్కుపై పుండ్లు రావడం, మేత మేయకపోవడంలేదు. ఈ నేపథ్యంలో సోమవారం 'ఆంధ్రజ్యోతి' 'మేకలకు అంతుచిక్కని వ్యాధి' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. స్పందించిన జీకేవీధి పశువైద్యాధికారి రమేష్ మంగళవారం గ్రామాన్ని సందర్శించారు. 46మేకలు, 38గొర్రెలకు చికిత్స అందించారు. ప్రస్తుతం వ్యాధులు అదుపులో ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని ఆయన తెలిపారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్థకశాఖ సహాయకులు వెంకటరమణ, సన్యాసిరావు పాల్గొన్నారు.

'ఏకలవ్య'లో వసతుల కల్పనకు రూ.10 లక్షలు

» జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



చైర్‌పర్సన్ సుభద్రకు వినతి పత్రమిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

పెదబయలు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతగుంట పంచాయితీ లకేపుట్టు వద్దనున్న ఏకలవ్య ఆదర్శ పాఠశాలను ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మంగళవారం సందర్శించారు. పాఠశాలలోని రికార్డులను తనిఖీ చేశారు. పాఠశాల వాతావరణం ఆహ్లాదకరంగా ఉండడంతో అభినందించారు. విద్యార్థినులతో మాట్లాడారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాలలో మెనూ సక్రమంగా అమలు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం పాఠశాలలో పెదబయలు మండలంతోపాటు హుక్కుంపేట, పాడేరు ఏకలవ పాఠశాలలకు చెందిన 570 మంది విద్యార్థులు ఉండటంతో వసతి సమస్య నెలకొంటోందని ప్రిన్సిపాల్ అమిత్ ఆనంద్ జడ్పీ చైర్‌పర్సన్‌కు వివరించారు. విద్యార్థులకు వసతితోపాటు తాగునీరు, పేరెంట్స్ వెయిటింగ్ హాల్‌కు సమస్యలు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. ఈ మేరకు వినతి పత్రమందించారు. చైర్‌పర్సన్ స్పందించి, పాఠశాల ఆవరణలో రెండు బోర్లు, ఒక పేరెంట్స్ వెయిటింగ్ హాల్ నిర్మాణానికి రూ.10లక్షలు కేటాయిస్తున్నట్టు తెలిపారు. త్వరలో ఈ పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఎంపీడీవో పూర్ణయ్య మాట్లాడుతూ పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మూర్తి, చంద్రుబాబు, జగబందు పాల్గొన్నారు.

సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సైన్స్ ఫర్ బెటర్ సొసైటీ ప్రతినిధి జగదీష్

పాడేరు రూరల్,జూలై 22 (ఆంధ్రజ్యోతి):శాస్త్రీయ విజ్ఞానంపై గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మరింత అవగాహన పెంపొందించుకునేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నామని సైన్స్ ఫర్ బెటర్ సొసైటీ ప్రతినిధి సీహెచ్ జగదీష్ అన్నారు. సైన్స్‌పై వాస్తవ వివరాలు, ప్రయోగాల ద్వారా చరిత్రను గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లోని సుమారు వెయ్యిమంది విద్యార్థులకు వివరిస్తున్నామన్నారు. అందులో భాగంగా మంగళవారం స్థానిక తలారిసింగి బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు సైన్స్‌పై చైతన్య కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా నిర్వహించామన్నారు. చంద్రుడిపై మానవుడు అడుగు పెట్టి 56 ఏళ్ల అయిన సందర్భంగా ఈ ప్రయోగానికి సంబంధించి వీడియోలు, ప్రయోగాల ద్వారా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో యూఎస్‌ఏ కో- ఆర్డినేటర్ ఆశాజోతి , హెచ్‌ఎం టి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పతకాలు



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

పాడేరురూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈనెల 20వ తేదీన నిర్వహించిన 11వ రాష్ట్ర స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో అల్లూరి జిల్లా విద్యార్థులు 10 పతకాలను సాధించినట్టు కోచ్ నందకదొర రామారావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 2025 ఆంధ్రప్రదేశ్ షోటోకన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు కటా, కుమిటేల్లో ప్రతిభను కనపరచి పతకాలను సాధించారన్నారు. బ్లాక్ బెల్ట్‌లో పాడేరు మండలం వంచెడిగొందికి చెందిన కె.అశోక్, బంగారు, వెండి పతకాలు సాధించగా.. హుంకుంపేట మండలం జాంకారంవలసకు చెందిన కె.సూర్య ఆరెంజ్ బెల్ట్‌లో , కొండచీడిపుట్టుకు చెందిన కె.చంద్రకళ బ్రౌన్ బెల్ట్‌లో, పట్టం గ్రామానికి చెందిన వంతాల బాలేశ్ ఎల్లో బెల్ట్‌లో. వంతాల జయరాం బంగారు, వెండి పతకాలను సాధించారన్నారు. వీరికి టోర్నీ మేనేజ్‌మెంట్ గ్రాండ్ మాస్టర్ ఫౌండర్, డైరెక్టర్ కన్నయ్య శ్రీనివాసనాయుడు, పావనిధ్రువపత్రాలందించినట్టు చెప్పారు.

'చింతపల్లి కేంద్రంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలి'



మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యుడు బాలయ్య

చింతపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల పునర్విభజన చింతపల్లి కేంద్రంగా చేపట్టాలని స్థానిక జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య కోరారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2026లో నియోజకవర్గాల పునర్విభజన ప్రభుత్వం చేపట్టనుందన్నారు. ఈ నేపథ్యంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన చింతపల్లికి ప్రాధాన్యం కల్పించాలన్నారు. గతంలో చింతపల్లి నియోజకవర్గ పరిధిలో గొలుగొండ, నాతవరం మండలాలు ఉండేవని, ఈ రెండు మండలాలను నర్సీపట్నంలో విలీనం చేశారన్నారు. చింతపల్లి నియోజకవర్గం పరిధిలోని కొయ్యూరు, చింతపల్లి, జీకేవీధి మండలాలను పాడేరులో విలీనం చేశారన్నారు. జిల్లాలో చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు, రాజవొమ్మంగి మండలాలను కలుపుతూ చింతపల్లి నియోజక వర్గం ఏర్పాటు చేయాలన్నారు. ఈ నాలుగు మండలాలు వెనుకబడి ఉన్నాయని, నియోజక వర్గంగా ఏరాటు చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాగిన వెంగళరావు, వైసీపీ నాయకులు పాంగి గణబాబు, జల్లి సుధాకర్, గంగన్న పడాల్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ ప్రవేశాలకు 30 వరకు గడువు

చింతపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ (సార్వత్రిక విద్యా పీఠం) పది, ఇంటర్ ప్రవేశాలకు ఈనెల 30తో గడువు ముగుస్తుందని పెదబరడ గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఏఐ కోఆర్డినేటర్ వంతల చంద్రబాబు తెలిపారు. దూర విద్య ద్వారా పది, ఇంటర్ విద్యాభ్యాసం చేయాలని ఆశించే విద్యార్థులు ఈనెలాఖరులోగా పెదబరడ ఓపెన్ స్కూల్ కేంద్రంలో ప్రవేశం పొందాలన్నారు. పూర్తి సమాచారానికి ఫోన్లు: 83329 36703, 7569225462 సంప్రదించాలని కోరారు.

విదేశీ ఎగుమతులకు అనువుగా కాఫీ ఉత్పత్తి చేయాలి

» చిక్‌మంగళూరు సీసీఆర్ఐ డీఆర్

డాక్టర్ సెమితిల్ కుమార్



సోలార్ టర్నల్ డ్రైయర్ ప్రారంభిస్తున్న డీడీ సెంతిల్ కుమార్

చింతపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు విదేశీ ఎగుమతులకు అనుగుణ ప్రమాణాలతో నాణ్యమైన కాఫీ ఉత్పత్తి చేపట్టాలని చిక్‌మంగళూరు కేంద్ర కాఫీ పరిశోధన సంస్థ (సీసీఆర్ఐ) పరిశోధన సంచాలకులు(డీఆర్) డాక్టర్ సెంతిల్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని దిగువపాకలులో ఎం.నిట్టపుట్టు రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పీవో) కేంద్ర కాఫీ బోర్డు ఆర్థిక సహకారంతో నిర్మించిన కాఫీ గోదాం, సోలార్ టర్నల్ డ్రైయర్‌ని సీసీఆర్ఐ పరిశోధన సంచాకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన రైతులు పండించిన అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు వచ్చిందన్నారు. గిరిజనులు కాఫీ ఉత్పత్తిలో మెలకువలు, శాస్త్రీయ పద్ధతులు పాటించపోవడంతో అంతర్జాతీయ ధరలు పొందలేకపోతున్నారన్నారు. సాగులో నాణ్యతకు అధిక ప్రాధాన్యం ఇస్తే రైతులు గరిష్ఠ ధరలు లభిస్తాయన్నారు. నాణ్యమైన కాఫీ ఉత్పత్తికి కేంద్ర కాఫీ బోర్డు ఎఫ్‌పీవోల ద్వారా పూర్తి సహకారం అందిస్తుందన్నారు. కేంద్ర కాఫీ బోర్డు ఎఫ్‌పీవోలకు గోదాం, సోలార్ టర్నల్ డ్రైయర్ యూనిట్ ధరలో 75శాతం రాయితీ నగదు రూ.12.60 లక్షలు అందజేయనున్నట్టు చెప్పారు. గిరిజన ప్రాంతంలో ఐదు ఎఫ్‌పీవోలకు ఆర్థిక సహకారం అందిస్తున్నట్టు చెప్పారు. గిరిజన రైతులు వీటిని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన కాఫీ ఉత్పత్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బెంగళూరు జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శివకుమార్, పాడేరు డిప్యూటీ డైరెక్టర్ హెచ్‌ఆర్ మురళీధర్, ఆర్‌వీనగర్ శాస్త్రవేత్త డాక్టర్ సునీల్‌బాబు, మినుములూరు ఎస్ఎల్‌వో రమేశ్, చింతపల్లి జేఎల్‌వో రవి కుమార్, ఎఫ్‌పీవో ప్రతినిధులు బౌడు కుశలవుడు, అబ్బాయినాయుడు, సత్యనారాయణ, విష్ణుమూర్తి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏవోకు ఘన వీడ్కోలు



ఏవో లకే పాత్రుడికి సన్మానం చేస్తున్న ఎంపీపీ అప్పలరాజు, టీడీపీ నాయకులు

జి.మాడుగుల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బదిలీ అయిన మండల వ్యవసాయ అధికారి లకే పాత్రుడిని స్థానిక కూటమి నేతలు ఘనంగా సన్మానించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఈ వీడ్కోలు సభలో ముఖ్యఅతిథిగా ఎంపీపీ అప్పలరాజుతో పాటు ఎస్టీసెల్ ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొని ఏవోను సన్మాంచి, సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కె.రాంబాబు, ఐ. హనుమంతరావు, పి.కృష్ణమూర్తి, టి.సూరిబాబు, ఎస్.కొండబాబు, ఎంపీటీసీలు, రాజకీయ నేతలు పాల్గొన్నారు.

హైవేకి ఇరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్



చింతపల్లి ఏపీఆర్ కళాశాల దిగువన రహదారికి ఇరువైపులా నాటేందుకు సిద్ధం చేస్తున్న మొక్కలు

చింతపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 516-ఈ ఇరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్ చేస్తున్నారు. రాజమహేంద్రవరం నుంచి చింతపల్లి, పాడేరు, అరకు మీదుగా విజయనగరం వరకు జాతీయ రహదారి నిర్మాణం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ జాతీయ రహదారి నిర్మాణంలో వందల సంఖ్యలో వృక్షాలను తొలగించాల్సి వచ్చింది. దీంతో అటవీశాఖ అధికారులు జాతీయ రహదారి ఇరువైపులా మొక్కలను నాటాలని ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం చింతపల్లి- లంబసింగి మార్గంలో ప్రతి ఆరు మీటర్లకు ఒక మొక్కను జాతీయ రహదారుల సిబ్బంది నాట్లు వేయడం ప్రారంభించారు. గ్రామాలు మినహాయించి ఇతర ప్రాంతాల్లో మొక్కలు నాటుతామని జాతీయ రహదారుల అధికారులు తెలిపారు.

పాఠశాలకు భవనం లేక అవస్థలు



లబుడుపుట్టులో పాఠశాల భవనం నిర్మించాలని కోరుతున్న పెసా కమిటీ సభ్యులు, గ్రామస్థులు

ముంచంగిపుట్టు, జులై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో గల మాకవరం పంచాయతీ లబుడుపుట్టు గ్రామంలో పాఠశాలకు పక్కా భవనం నిర్మించాలని పెసా కమిటీ సభ్యులు, గ్రామస్థులు కోరారు. ఆ గ్రామంలో పాఠశాల భవనం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు అందించినా ఫలితం లేకపోవడంతో మంగళవారం పెసా కమిటీ సభ్యులు, గ్రామస్థులు శ్రమదానంతో తాత్కాలిక రేకు షెడ్డును ఏర్పాటు చేశారు. అలాగే, షెడ్డు పైకప్పు రేకులు కొనుగోలుకు ఆర్థిక సహాయం అందించిన పెసా కమిటీ ఉపాధ్యక్షులు కె.గణపతిని అభినందించారు. సుమారు 27 మంది విద్యార్థులు చదువుతున్నారని, ఈ స్థితిలో పాఠశాల భవనం నిర్మాణ పనులు జరిగే విధంగా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పెసా కమిటీ ప్రతినిధులు డి.ఫులంద్, బాబూరావు, లక్ష్మణ్, ప్రసాద్, నర్సింగమూర్తి పాల్గొన్నారు.

మృతదేహం ఆచూకీపై సమాచారమివ్వాలి: ఎస్ఐ

సీలేరు, జూలై 22 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు పోలీస్టేషన్ పరిధిలో సప్పర్ల రేయిన్ గేజ్ వద్ద 2021లో లభ్యమైన గుర్తు తెలియని మృత దేహం ఆ చూకీ తెలిస్తే సమాచారమందించాలని సీలేరు ఎస్ఐ రవీంద్ర కోరారు. 2021లో ఎవరైనా తప్పిపోయిన వయస్సు 30 నుంచి 40 సంవత్సరాల గల (పురుషుడు) ఉంటే సంబంధిత కుటుంబ సభ్యులు సీలేరు పోలీస్టేషన్‌ను సంప్రదించి కేసు పరిష్కారానికి సహకరించాలని ఎస్ఐ రవీంద్ర కోరారు.


అధికారులతో కలిసి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ కరక సత్యనారాయణ

నాతవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే మండల స్థాయి అధికారులతో కలిసి ప్రతీ మంగళవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ కరక సత్యనారాయణ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ప్రజాదర్బార్ నే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా ప్రతీ మంగళవారం ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి ప్రజా దర్బార్‌లో తెలపాలని సూచించారు. ఈ సమస్యలను అక్కడే ఉన్న అధికారులు పరిష్కరిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల నుంచి ప్రజలు సమస్యలపై అధికారులకు వినతులు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు, మండల పరిషత్ పరిపాలనాధికారి పార్థసారథి, ఉపాధి పథకం ఏపీవో కొండాజీ, వెలుగు ఏపీఎం కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

'గణేశ్.. అసత్య ప్రచారాలు మానుకోండి'


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మాకవరపాలెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాటు అసమర్థ పాలన చేయడంతోనే ప్రజలు ఇంటికి పంపించారన్న విషయం గుర్తు ఉంచుకుని అసత్య ప్రచారాలు మానుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు మాజీ ఎమ్మెల్యే గణేశ్‌కు సూచించారు. మంగళవారం పీఏసీఎస్ మాజీఅధ్యక్షుడు అల్లు రామునాయుడుతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ మోసం, ప్రజలు గ్యారెంటీ, గణేశ్ మాట అబద్ధాల మూట అనే పేరు పెట్టుకొని గ్రామాలవెంట తిరిగితే బాగుటుందని హితవు పలికారు. అలాగే వాక రేడు ఏ భూమిలో వేస్తున్నారో తెలియని పరిస్థితిలో వైసీపీ నాయకులు ఉండడం విచారకరమన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు సలహా ఇచ్చే స్థాయి వైసీపీ నేతలకు లేదని హితవు పలికారు. సాగుదారులకు న్యాయం చేయడానికి తమ ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చినబాబు, రమణ, గోవింద, కె.శ్రీను పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుపై విచారణ

మాకవరపాలెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జి.కోడూరు రెవెన్యూలో ఉన్న నల్లరాయి క్వారీ అనుమతులు రద్దు చేయాలని స్పందనలో అందిన ఫిర్యాదుపై మైనింగ్ విజిలెన్స్ అసిస్టెంట్ డెరెక్టరు పి.అశోక్‌కుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. జి.కోడూరు క్వారీ వద్దకు వచ్చి దళిత రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మైనింగ్ అధికారులు స్పందించి క్వారీ అనుమతులు రద్దు చేయాలని వారు కోరారు. అనంతరం మైనింగ్ అధికారి మాట్లాడుతూ క్వారీకి అనుమతులు ఉన్నాయా? లేదా? అనే విషయాలను పూర్తిగా పరిశీలించి కలెక్టర్ నివేదిక ఇస్తామని తెలిపారు.

బ్రిటిష్ సైనికాధికారుల సమాధుల స్థలం

సరిహద్దు వివరాలు అందించండి

నర్సీపట్నం, జూలై 22(ఆంధ్రజ్యోతి): బ్రిటిష్ సైనికాధికారుల సమాధుల స్థలానికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు అందజేయాలని నర్సీపట్నం తహశీల్దార్‌ను పురావస్తు శాఖ ఏడీ ఫాల్గుణరావు లిఖిత పూర్వకంగా కోరారు. మెయిన్ రోడ్డును ఆనుకొని పాత చెక్కావారి బంకు ఎదురుగా 19 సెంట్ల బ్రిటిష్ సైనికాధికారుల సమాధుల స్థలం ఉంది. స్థలం పరిరక్షణ, అభివృద్ధి కోసం న్యాయ సేవాధికార సంస్థకు అల్లూరి స్మారక ప్రాంతాల పరిరక్షణ కమిటీ కన్వీనర్ పీవీ సత్యనారాయణరావు ఫిర్యాదు చేశారు. ఈ నెల పదవ తేదీన న్యాయమూర్తి పి.షియాజ్‌ఖాన్ పురావస్తుశాఖ ఏడీ ఫాల్గుణరావు, మునిసిపల్ కమిషనర్ సురేంద్ర, రెవెనూ సర్వే అధికారులతో కలిసి స్థలాన్ని సందర్శించారు. స్థలం రక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని పురావస్తు శాఖ ఏడీ ప్రకటించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం బ్రిటిష్ సైనికాధికారుల స్థలాన్ని పురావస్తుశాఖలో విలీనం చేస్తూ 4(1) నోటీసులు ఇచ్చింది. ఈ నోటిఫికేషన్ ఇచ్చే ముందు అప్పటి రెవెన్యూ అధికారుల నుంచి ఈ స్థలానికి సంబంధించిన స్కెచ్, సరిహద్దు వివరాలను తీసుకున్నారు. తుది నోటిఫికేషన్ 4(3) ఇవ్వలేదు. ఇంతలో రాష్ట్ర విభజన జరిగింది. అల్లూరి స్మారక ప్రాంతాల పరిరక్షణ కమిటీ కన్వీనర్ సత్యనారాయణరావు న్యాయసేవాధికార సంస్థకు ఫిర్యాదు చేయడంతో మళ్లీ కదలిక వచ్చింది. తాజాగా మరోసారి 4(1) నోటిఫికేషన్ ఇచ్చి


బ్రిటీష్ సైనికాధికారుల సమాధులు

తదుపరి 4(3) తుది నోటిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ స్థలానికి సంబంధించిన స్కెచ్, మ్యాప్‌లో ఉన్న సరిహద్దు వివరాలు మరో సారి పంపాలని నర్సీపట్నం తహసీల్దార్‌ను పురావస్తుశాఖ ఏడీ లిఖితపూర్వకంగా కోరారు.

'ఆచరణ సాధ్యంకాని హామీలతో మోసం'

నర్సీపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆచరణ సాధ్యంకాని హామీలతో ప్రజలను చంద్రబాబు మోసం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ విమర్శించారు. స్థానిక వేదిక పంక్షన్ హాలులో మంగళవారం బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంపై వైసీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు ఇస్తానని హామీ ఇచ్చి ఒక్కటే ఇచ్చారన్నారు. తల్లికి వందనం డబ్బులు పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు అందలేదన్నారు. సంక్షేమాన్ని పక్కనపెట్టి ప్రతిపక్ష నేతలను ఇబ్బంది ఎలా పెట్టాలా అని చూస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు సన్యాసిపాత్రుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మ భూములు ఆక్రమిస్తే చర్యలు


లింగంపేటలో భూముల ఆక్రమణలు పరిశీలిస్తున్న ఈవో

గొలుగొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపేట నూకాలమ్మ అమ్మవారి భూముల ఆక్రమణలను ఈవో టి.సాంబశివ రావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఆలయ భూములను ఆక్రమించుకున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు పరిశీలించామన్నారు. భూములు సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగిస్తామని చెప్పారు. అలాగే ఆక్రమణదారులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అన్ని జిల్లాల్లోనూ బీసీ భవనాలు

- వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం సర్వ నాశనం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత


సమావేశంలోమాట్లాడుతున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

అనకాపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని జిల్లాలోనూ బీసీ సంక్షేమ భవనాలు నిర్మిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. వైసీపీ గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో సర్వనాశనమైందని ఆరోపించారు. మంగళవారం అనకాపల్లి జిల్లాలో పర్యటనకు వచ్చిన ఆమె స్థానిక పెంటకోట కన్వెన్షన్ హాలులో టీడీపీ నియోజకవర్గ నాయకులతో జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సీఎం చంద్రబాబు మహిళా పక్షపాతి అన్నారు. బీసీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లో బీసీ సంక్షేమ భవనాలు ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్ర భవిష్యత్‌కు సీఎం చంద్రబాబు ఒక దిక్సూచిగా అభివర్ణించారు. మహిళలను వ్యాపారవేత్తలుగా చేయాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు, మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో లక్ష మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి, వారికి మిషన్లు పంపిణీ చేస్తున్న ఘతన కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్‌లను జగన్ ప్రభుత్వం ఎత్తివేస్తే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పునఃప్రారంభించి పేదల ఆకలి తీర్చుతున్నట్టు చెప్పారు. జగన్‌రెడ్డి ఒక్క చాన్స్ కావాలని అధికారాన్ని చేజిక్కించుకొని రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. మంత్రి లోకేశ్ విద్యా రంగంలో అనేక మార్పులు తీసుకొస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, విశాఖ జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు, అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి, పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, బత్తుల తాతయ్యబాబు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోండి

జిల్లా మలేరియా నివారణాధికారి వరహాలదొర

నాతవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మలేరియా రాకుండా వైద్య సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి కె.వరహాలదొర ఆదేశించారు. నాతవరం ఆరోగ్య కేంద్రంలో మలేరియా, డెంగ్యూ, చికూన్‌గున్యా తదితర వ్యాధులపై జరుగుతున్న శిక్షణ తరగతులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారానికోసారి ఫ్రైడే డ్రైడే పాటించాలని సూచించారు. అలాగే యాంటీలార్వా ఆపరేషన్, దోమ తెరల వాడకం గురించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో ఎ.జె.సత్యనారాయణ ఎంపీహెచ్‌వో కె.వి.రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఐటీఐలలో రెండో విడత ప్రవేశాలు

నర్సీపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి బుధవారం నుంచి రెండో విడత ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకొని, ఐటీఐ కార్యాలయంలోలో తనిఖీ చేయించుకోవాలని సూచించారు. ఆధార్, కుల, ఆదాయ, అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో బుధవారం ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు.

జీవ ఎరువులతో జర జాగ్రత్త

నర్సీపట్నం అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జీవ ఎరువులు వాడేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.విజయలక్ష్మి సూచించారు. మండలంలోని ఎరకన్నపాలెం, అమలాపురంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవ ఎరువుల కాల పరిమితి ఆరు నుంచి 12 నెలలు ఉంటుందన్నారు. బయో ఫెర్టిలైజర్స్ కాలపరిమితి దాటిన తర్వాత వినియోగించకూడదని సూచించారు. రసాయనిక ఎరువులు, కీటక నాశకాలతో కలిపి వాడకూడదన్నారు. అనంతరం గ్రామాలలో వరి నారు మడులను పరిశీలించారు.

సిహెచ్.నాగాపురంలో వైద్య శిబిరం

కృష్ణాదేవిపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిహెచ్.నాగాపురం గ్రామంలో వైరల్ జ్వరాలు అధికంగా రావడంతో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వర్షాల సీజన్ కావడంతో ప్రజలు జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి ఎస్.గాయిత్రీ సూచించారు. రోగులను వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులను అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రఘురామచంద్రరావు, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 3డీ పాఠాలు

మాకవరపాలెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు కోసూరు రాము విద్యార్థులకు ఆసక్తి కలిగించేలా బోధిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు 3డీ వీడియోలను చూపిస్తూ సంబంధిత పాఠ్యాంశాలను వివరిస్తున్నారు. మంగళవారం బ్రెయిన్ డే సందర్భంగా మెదడు పని చేసే విధానాన్ని 3డీలో వివరించారు. ఈ పాఠాలను విద్యార్థులు ఆసక్తిగా వింటున్నారు.

కోన తాతారావును కలిసిన సొసైటీ చైర్‌పర్సన్లు

దేవరాపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ కోన తాతారావును ఎం.అలమండ, దేవరాపల్లి సహకార సంఘాల చైర్‌పర్సన్లు గొర్లె గోవింద, పూడి సత్యారావు మంగళవారం డీసీసీబీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వీరికి పలు సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు, రైతులకు అందుబాటులో ఉండి సాయపడాలని కోన తాతారావు చైర్‌పర్సన్‌లకు సూచించారు. వీరి వెంట దొగ్గనాయుడు తదితరులు ఉన్నారు.


కోన తాతారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సొసైటీ చైర్‌పర్సన్లు

బండారుని కలిసిన..

మాడుగుల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఏసీఎస్ చైర్‌పర్సన్స్ మంగళవారం పరవాడ మండలం వెన్నెలపాలెంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని కలిసి సన్మానించారు. అనంతరం సొసైటీల ప్రగతిపై ఎమ్మెల్యేతో చర్చించారు.

ఏఎస్ఐగా సత్యనారాయణకు పదోన్నతి



బుచ్చెయ్యపేట, జూలై 12 (ఆంధ్ర జ్యోతి): బుచ్చెయ్యపేట పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తున్న పతివాడ సత్యనారాయణ ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. మంగళవారం సత్యనారా యణను ఎస్ఐ శ్రీనివాసరావు, ఏఎస్ఐ భాస్కరరావు, సిబ్బంది అభినందించారు

ఘనంగా వడ్డాదిలో మోదకొండమ్మ పండుగ

బుచ్చెయ్యపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాదిలో మంగళవారం మోదకొండమ్మ పండుగ ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఎస్సీ కాలనీ, కుమ్మరవీధి, పెదబజారు, చిన బజారు నుంచి మహిళలు ఘటాలను ఉరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. గత మంగళవారం కొంత మంది జరుపుకోగా. మరికొంతమంది ఈ మంగళవారం జరుపుకున్నారు. గ్రామ పెద్దల మధ్య సమన్వయం లేకపోవడంతో రెండు వారాలు చేసుకోవలసి వచ్చిందని గ్రామస్థులు తెలిపారు.

చుక్కపల్లి డ్రైనేజీల్లో పూడికతీత

చీడికాడ, జూలై 22 (ఆంధ్ర జ్యోతి): మండలంలో చుక్కపల్లిలో గ్రామంలో డ్రైనేజీల్లో పూడికతీత కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. గ్రామంలో ఉన్న ఇద్దరు పారిశుధ్య కార్మికులు పూడిక తీస్తుండగా డిప్యూటీ ఎంపీడీవో సీహెచ్ చంద్రశేఖరరావు పరిశీలించారు. అనంతరం మండలంలో చుక్కపల్లి, కొత్తపల్లిల్లో డిప్యూటీ ఎంపీడీవో రికార్డులను పరిశీలించి పలు సలహాలు, సూచనలు అందించారు. ఆయన వెంట జి.కొత్తపల్లి, చుక్కపల్లి కార్యదర్శులు పట్నాల గోపి, రామలింగేశ్వరరావు ఉన్నారు.


చుక్కపల్లి డ్రైనేజీలో పూడికతీస్తున్న పారిశుధ్య కార్మికులు

అసంపూర్తి రిజర్వాయర్ల పనుల పూర్తికి చర్యలు

- ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న రిజర్వాయర్ల పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. మంగళవారం మాడుగుల మండలం తాటిపర్తి ఎన్టీఆర్ జలాశయం వద్ద జలహారతి ఇచ్చిన అనంతరం ఆయకట్టుకు సాగునీటిని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు పూర్తిస్థాయిలో సాగు నీరందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ జలాశయం ఆధునికీకరణ పనుల చేపట్టేందుకు రూ. 11.5 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించినట్టు చెప్పారు. వైసీపీ ప్రభుత్వం రిజర్వాయర్లను నిర్లక్ష్యం చేసిందని ఆయన విమర్శించారు. అనంతరం తాటిపర్తి గ్రామంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం 14 నెలల్లో చేసిన అభివృద్ధిని గురించి వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ


తారకరామ రిజర్వాయర్ వద్ద జలహారతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

చైర్మన్ పుప్పాల అప్పలరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అద్దేపల్లి జగ్గారావు, క్లస్టర్ ఇన్‌చార్జి పుప్పాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై అప్రమత్తంగా ఉండాలి

- కార్యదర్శులకు జిల్లా పంచాయతీ అధికారి సందీప్ ఆదేశం

చోడవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని జిల్లా పంచాయతీ అధికారి సందీప్ పంచాయతీ కార్యదర్శులకు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మండలంలోని వెంకన్నపాలెం, ముద్దుర్తి పంచాయతీల్లో పర్యటించి గ్రామాల్లో పారిశుధ్యం పరిస్థితిని పరిశీలించారు. ముద్దుర్తి పంచాయతీలో పారిశుధ్యం పరిస్థితిని మరింత మెరుగుపడాలని ఆదేశించారు. వర్షాకాలం కావడంతో సీజన్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. కాలువల పూడికతీత, బ్లీచింగ్, తాగునీటి క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్యక్రమాల అమలుతీరును ఆయన పరిశీలించారు.

మండల పరిషత్‌లో కార్యదర్శులతో సమావేశం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో జిల్లా


వెంకన్నపాలెంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీపీవో సందీప్

పంచాయతీ అధికారి సందీప్ సమావేశమయ్యారు. గ్రామాల్లో పరిస్థితులపై సిబ్బందికి సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పీఎస్‌జే ఆంజనేయులు, ఈవోపీఆర్‌డీ అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలిఅడుగుతో సమస్యల పరిష్కారం

చీడికాడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సుపరి పాలనలో తొలిఅడుగు కార్యక్రమంతో సమస్యలు పరిష్కారం అవుతాయని టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు వాసిరెడ్డి ఏసుదాసు అన్నారు. మంగళవారం బైలపూడిలో టీడీపీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ఇప్పటికే ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. అనంతరం గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలన్నీ స్థానిక టీడీపీ నాయకుల ద్వారా పరిష్కారానికి కృషిచేస్తానని పరిశీలకుడు ఏసుదాసు అన్నారు.

ఈ కార్య క్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గాడి నాగ రత్నం, మాజీ ఎంపీపీ పోతల రమణమ్మ, టీడీపీ నాయకులు జాజిమొగ్గల గణేష్, నాగరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

చీడికాడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా రీసోర్స్ కేంద్రం వ్యవసాయ అధికారిణి తులసీమణి అన్నారు. మంగళవారం అప్పలరాజుపురం, ఖండివరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల వరి పొలాలను పరిశీలించారు. అనంతరం ఏవో కృష్ణవేణి మాట్లాడుతూ, అన్నదాత సుఖీభవ పథకానికి పేర్లు లేని రైతులు రైతుసేవా కేంద్రాలకు వెళ్లి తమ పేర్లు సరిచేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు చుక్క అప్పలనాయుడు, శీరంరెడ్డి లక్ష్మి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు ఫైలేరియా వ్యాక్సినేషన్

చీడికాడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఫైలేరియా వ్యాక్సినేషన్‌ను పాడి రైతులు వినియోగించుకోవాలని ఖండివరం పశువైద్యాధికారి సీహెచ్.గణేష్‌రెడ్డి కోరారు. మండలంలోని అప్పలరాజుపురంలో మంగళవారం ఆవులకు వ్యాక్సినేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆవులకు పిరుదుల ద్వారా ఈ వ్యాధి సంక్రమిస్తుందన్నారు.

అర్ల పాఠశాల హెచ్‌ఎంపై తహశీల్దార్ విచారణ


అర్ల పాఠశాలలో తల్లిదండ్రుల సమక్షంలో విచారణ చేపడుతున్న తహశీల్దార్ నాగమ్మ

రోలుగుంట, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్ల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బోనెల రాముపై తల్లిదండ్రులు, గ్రామస్థులు మీకోసంలో ఆర్డీఓకు చేసిన ఫిర్యాదుపై మంగళవారం తహశీల్దార్ నాగమ్మ పాఠశాలలో విచారణ చేపట్టారు. పాఠశాలలో ఈ హెచ్‌ఎం విధులు నిర్వహించడానికి వీల్లేదని, బదిలీ చేయాలని తల్లిదండ్రులు విన్నవించారు. అనంతరం హెచ్‌ఎం రామును కూడా విచారించి, వివరాలు నమోదు చేశారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తహశీల్దార్ నాగమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రామమూర్తి, స్కూల్ కమిటీ చైర్మన్ పాడి లక్ష్మి, వైస్ చైర్మన్ పాడి శ్రీను, తల్లిదండ్రులు పాడి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై గ్రామైక్య సంఘాలు ప్రచారం : ఏపీవో


సమావేశంలో మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం చిన్నబాబు

కె.కోటపాడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సామాజిక అవసరాలు తీర్చే విధంగా పంచాయతీలతో కలిసి గ్రామైక్య సంఘాలు పనిచేయాలని వెలుగు ఏపీఎం కె.చిన్నబాబు తెలిపారు. మంగళవారం సెర్ప్ కార్యాలయంలో గ్రామీణ సమృద్ధి వాస్తవిక ప్రణాళికపై గ్రామైక్య సంఘాలకు ఒక రోజు శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ గ్రామాల్లో పీఎం సూర్యఘర్, ప్రకృతి వ్యవసాయం, స్త్రీనిధి రుణాలు, బ్యాంకు రుణాలపై ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో మండల సమైక్య అధ్యక్షురాలు ఆర్.యశోద, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

హరిహర వీరమల్లు విజయం సాధించాలని జనసేన నేతల పూజలు

బుచ్చెయ్యపేట, జూలై 22 (ఆంధ్ర జ్యోతి): మండలంలో మంగళవారం దిబ్బిడి శివాలయంలో హరి హర వీరమల్లు చిత్రం అఖండ విజయం సాధించాలని జనసేన నాయకులు పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన చిత్రం విజయం సాధించాలని పూజలు జరిపామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు డీఎస్ నాయుడు, ఎడ్ల రామూర్తి, మండపాక బాబూరావు, సీతాగణేష్ పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు జరుపుతున్న జనసేన నాయకులు

నారుమడులపై జాగ్రత్తలు తీసుకుంటే మేలు

దేవరాపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వరి నారుమడులపై అధికారులు చేసిన సూచనలు పాటిస్తే రైతులకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి ఎల్వై కాంతమ్మ అన్నారు. మండలంలోని తారువలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వరినారుమడులు తయారీ, నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అల్లు.శ్రీను, రెడ్డి అశోక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మహలక్ష్మినాయుడు, బూడి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

50 మందికి కంటి పరీక్షలు

దేవరాపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. విశాఖపట్నం శంకర ఫౌండేషన్ వారి సహకారంతో 50 మందికి పరీక్షలు చేయగా.. 20 మందిని ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో శంకర ఫౌండేషన్ క్యాంప్ కో-ఆర్డినేటర్ అశ్వనీకుమార్, ఆప్తాలమిక్ ఆర్.దుర్గా భవానీ, వెంకటపతి, తదితరులు పాల్గొన్నారు.


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

బోరుమంటున్న మెకానిక్‌లు

- సకాలంలో జీతాలు అందక ఇబ్బందులు
- మూడు దశాబ్దాలుగా థర్డ్ పార్టీ ద్వారా వేతనాల చెల్లింపు
- కాంట్రాక్టర్ దయాదాక్షిణ్యాలపైనే జీవనం
- అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించాలని వేడుకోలు
- కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఆశాభావం

ఉమ్మడి విశాఖ జిల్లాలో 92 మంది మంచినీటి బోర్ల మెకానిక్‌లు

చోడవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి విశాఖ జిల్లాలోని మంచినీటి బోరు మెకానిక్‌ల జీవనం దుర్భరంగా ఉంది. కనీసం వీరిని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా కూడా గుర్తించడం లేదు. థర్డ్ పార్టీ ఏజెన్సీ పేరిట.. అది కూడా కాంట్రాక్టర్ ద్వారా వీరికి గత 30 ఏళ్లుగా జీతాలు చెల్లిస్తున్నారు. దీంతో నెలల తరబడి వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.





బోరు మరమ్మతు పనుల్లో నిమగ్నమైన మెకానిక్‌లు (ఫైల్ ఫొటోలు)

మండల పరిషత్, గ్రామీణ నీటిసరఫరా శాఖల ఆధ్వర్యంలో రాష్ట్రంలో 526 మంది మంచినీటి బోరు మెకానిక్‌లు పనిచేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని 39 మండలాల్లో 23,600 పైగా బోర్లు ఉన్నాయి. ఈ బోర్ల నిర్వహణకు 92 మంది మెకానిక్‌లు పనిచేస్తున్నారు. మండల పరిషత్‌లకు విడుదలయ్యే ఆర్థిక సంఘం నిధుల నుంచి ఏటా తాగునీటి వనరుల నిర్వహణ కోసం గ్రాంటు విడుదల చేస్తుంటుంది. ఈ నిధుల్లోనే బోర్లు పరికరాల కొనుగోలుతో పాటు మెకానిక్‌లకు ఇచ్చే వేతనాలు కూడా ఉంటాయి. ఎన్నో సంవత్సరాల నుంచి పనిచేస్తున్నా ఇప్పటికీ వీరి వేతనం రూ.15 వేలకు మించి లేదు. సీజన్‌తో సంబంధం లేకుండా ఏడాది పొడవునా బోర్లుతో పాటు రక్షిత మంచినీటి పథకాల బాగోగులు చూసే మెకానిక్‌లకు సక్రమంగా జీతాలు అందడం లేదు. మండల పరిషత్ నుంచి ఇచ్చే వేతనాలు ఎవరైనా కాంట్రాక్టర్ ఖాతాలోకి జమ చేస్తారు. ఆ కాంట్రాక్టర్ ఖాతా నుంచి వీరికి జీతాలు చెల్లిస్తుంటారు. కొందరు కాంట్రాక్టర్లు తమ ఖాతాలో పడిన డబ్బులు వెంటనే ఇచ్చేస్తే, మరికొందరు వారి అవసరాలకు ఖర్చు పెట్టుకుని తమకు నచ్చినప్పుడు లేదా తన వద్ద డబ్బులు ఉన్నపుడు వీరికి వేతనాలు చెల్లిస్తున్నారు. ఇటీవల తమకు జీఎస్టీ భారం పడుతుందని చెప్పి కొంత మంది కాంట్రాక్టర్లు వీరికి వచ్చే వేతనాల నుంచి కోత పెడుతున్నారు. ఇక మండలాల్లో మండల పరిషత్ అధికారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి వీరి వేతనాలు ఉంటాయంటే అతిశయోక్తి కాదు. కొన్ని మండలాల్లో బడ్జెట్ వచ్చినా, దిగువ స్థాయి సిబ్బంది వీరికి సకాలంలో వేతనాల బిల్లు పెట్టే విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో కొందరికి నెలల తరబడి వేతనాలు అందని పరిస్థితి నెలకొంది. ఇంతా చేస్తే వీరికి ఇచ్చే వేతనం రోజుకి రూ.450 మించడం లేదు. ఇందులోనే తమ విధి నిర్వహణ నిమిత్తం గ్రామాలకు వెళ్లిరావడానికి ఇతరత్రా రవాణా ఖర్చులు కూడా భరించవలసిందే.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగానైనా గుర్తిస్తే..

ఇన్ని సంవత్సరాల సీనియారిటీ ఉన్న ఉద్యోగులు మరే శాఖలోనైనా ఉంటే, ఈపాటికి తమ ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలనో లేదా తమ వేతనాలు పెంచాలనో ఆందోళనలు చేసేవారు. అయితే వీరు తమను అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగానైనా గుర్తించి ప్రతి నెలా వేతనాలు చెల్లించాలని వేడుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇలా ప్రభుత్వ శాఖల్లో ఎదుగూబొదుగూ లేని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను గుర్తించి వారికి న్యాయం చేసేందుకు మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్‌లతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ అయినా తమకు న్యాయం చేయాలని బోరు మెకానిక్‌లు వేడుకుంటున్నారు.

జీతాలు సక్రమంగా అందడం లేదు



ఎన్నో సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటూ వస్తున్నాం. మాకు ఇచ్చే వేతనం కూడా ఎప్పుడు వస్తుందో చెప్పలేని పరిస్థితి. ఒక్కోసారి ఎనిమిది, తొమ్మిది నెలలు కూడా వేతనాలు చేతికి అందని దుస్థితి ఉంది. అప్పులు చేసి బతుకులు నెట్టుకొస్తున్నాం. ఎప్పటికైనా మా ఉద్యోగాలు రెగ్యులర్ అవుతాయన్న ఆశతోనే పనిచేస్తున్నాం. తక్కువ వేతనం అయినా ప్రతి నెలా ఇస్తే మాకు ఎంతోకొంత ఆసరాగా ఉంటుంది. మా ఉద్యోగాలు క్రమబద్ధీకరించకపోయినా, కనీసం మమ్మల్ని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగానైనా గుర్తించి మాపేరుమీద నెలనెలా వేతనం ఇప్పించాలి. థర్డ్ పార్టీ ద్వారా వేతనాలు ఇచ్చే పద్ధతిని రద్దు చేసి మంత్రి నారా లోకేశ్ మాకు న్యాయం చేస్తారని ఆశతో ఉన్నాం.

- పి.నాగేశ్వరరావు, పీఆర్,
ఆర్‌డబ్ల్యూఎస్ బోరు మెకానిక్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు

3 వేల ఎలక్ట్రిక్ బస్సులు

రెండేళ్లలో ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువస్తాం

- రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్, రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, తదితరులు వున్నారు.

ఎలమంచిలి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ)లో ఎన్నో మార్పులు తీసుకువచ్చామని, ముఖ్యంగా ఏడాది కాలంలో 1,400 కొత్త బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో రూ.28 లక్షలతో నిర్మించిన డ్రైవర్ల విశ్రాంతి భవనాన్ని ఎమ్మెల్యే విజయ్‌కుమార్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, రానున్న రెండేళ్ల కాలంలో కొత్తగా మూడు వేల ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. పీ-4 విధానంలో అవసరమైన ప్రాంతాల్లో మోడల్ బస్టాండ్‌లు నిర్మించడానికి సీఎం చంద్రబాబునాయుడు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఎలమంచిలి నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నదని, అందువల్ల రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడంతోపాటు దూరప్రాంత ఎక్స్‌ప్రెస్ బస్సులు ఎలమంచిలి మీదుగా రాకపోకలు సాగించేలా చర్యలు చేపట్టాలని మంత్రిని కోరారు. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ, ఎలమంచిలికి ఆర్టీసీ డిపో మంజూరు చేస్తే.. ఇందుకు అవసరమైన స్థలాన్ని సమకూరుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దూలి రంగనాయకులు, ఆర్టీసీ విజయనగరం జోన్ ఈడీ బ్రహ్మానందరెడ్డి, ఈఈ కె.అరుణకుమార్, డీపీటీవో ప్రవీణ, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజరు కె.పద్మావతి, కూటమి నాయకులు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, కొలుకులూరి విజయ్ బాబు, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, రాజాన శేషు, కరణం రవి, బొద్దపు రమణ, తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో నకిలీ డాక్టర్ అరెస్టు

- కిడ్నీలు ఇప్పిస్తానంటూ కొందరిని, ఇచ్చేందుకు ముందుకొచ్చిన మరికొందరిని మోసగించి డబ్బులు తీసుకున్న వైనం

విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ బాధితులను, కిడ్నీలు అమ్ముతానంటూ ముందుకొచ్చిన వారిని మోసగిస్తున్న నకిలీ డాక్టర్‌ను నాలుగో పట్టణ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అనంతపురం జిల్లా గుంతకల్లు విద్యానగర్‌లో నివాసం ఉంటున్న సయ్యద్ హనీఫ్ షా (54) తన ఫేస్‌బుక్‌లో కిడ్నీ డోనర్స్ గ్రూపు క్రియేట్ చేశాడు. అందులో తనను డాక్టర్ ఆనంద్‌గా పరిచయం చేసుకున్నాడు. ఈ క్రమంలో కొంతమందిని నమ్మించి డబ్బులు తీసుకొని ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడం లేదా బ్లాక్ చేయడం చేసేవాడు. ఇదే తరహాలో జనవరిలో అక్కయ్యపాలెంలోని బికాన్ హోటల్‌కు ఫోన్ చేశాడు. తనకు సంబంధించిన రోగులు ఒడిశా నుంచి వస్తున్నారని, రూమ్ కావాలని చెప్పాడు. డబ్బులు తానే చెల్లిస్తానన్నాడు. ఒడిశా ప్రాంతానికి చెందిన ముగ్గురు జనవరి 28న వచ్చి మూడు రోజులు ఉన్నారు. వారు డబ్బులు ఇవ్వకుండా వెళ్లిపోయారు. అదే తరహాలో జూన్ 29న హోటల్‌కు ఫోన్ చేసి ఇద్దరికి రూమ్ కావాలని చెప్పాడు. 30న ఏలూరుకు చెందిన రాంబాబు, యేసు రాజు వచ్చారు. వారు హోటల్‌లో ఉండి డాక్టర్ ఆనంద్‌కు ఫోన్ చేస్తే లిఫ్టు చేయలేదు. అయితే వీరు కిడ్నీ అమ్మకం గురించి మాట్లాడుతుండడంతో హోటల్ మేనేజర్ అబ్బాస్ నాలుగో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ సత్యనారాయణ వారిని పిలిపించి విచారించి పంపేశారు. అయితే తమకు అద్దె చెల్లించలేదని హోటల్ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ చిన్నంనాయుడు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు డాక్టర్ ఆనంద్ పేరుతో పరిచయం చేసుకుంటున్న నకిలీ డాక్టర్ సయ్యద్ హనీఫ్ షాను అదుపులోకి తీసుకున్నారు. కిడ్నీ ఇప్పిస్తానంటూ కొంతమందిని, కిడ్నీ ఇచ్చేందుకు ముందుకువచ్చిన మరికొంతమందిని (మొత్తం ఏడుగురు) సయ్యద్ హనీఫ్ నమ్మించి డబ్బులు వసూలు చేసినట్టు పోలీసుల విచారణలో తేలింది. సయ్యద్ హనీఫ్ షాను మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు సీఐ సత్యనారాయణ తెలిపారు

విద్యుత్ చార్జీలు పెంచలేదు, పెంచబోము

... 5వ పేజీ తరువాయి

చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు.

చేనేత సహకార సంఘాల ఎన్నికలకు త్వరలో నోటిఫికేషన్

రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని, త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేయనున్నామని మంత్రి ఎస్.సవిత తెలిపారు. అనకాపల్లి వచ్చిన ఆమెను మంగళవారం సాయంత్రం బీసీ వెల్ఫేర్, బీసీ కార్పొరేషన్, జౌళి శాఖ అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శాఖల వారీగా ఆమె అధికారులతో మాట్లాడారు. చేనేత రంగ అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. చేనేత సహకార సంఘాలను బలోపేతం చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా త్వరలో చేనేత సహకార సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నామన్నారు. ఆప్కో, లేపాక్షి షోరూమ్‌ల ద్వారా అమ్మకాలు పెంచాలని ఆయా అధికారులను ఆదేశించారు.

అధ్వానంగా పుష్కరిణి

... 5వ పేజీ తరువాయి

వుంటుంది. ఆలయానికి ఆనుకొని వున్న పుష్కరిణిలో కార్తీక మాసంలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించడం ఆనవాయితీ. కార్తీక పౌర్ణమి, పోలి పాడ్యమి పర్వ దినాల్లో మహిళలు పూజలుచేసి, పుష్కరిణిలో దీపాలు వదులుతుంటారు. ఉత్సవాల సందర్భంగా స్వామివారికి ఈ పుష్కరిణిలోనే చక్రస్నానం, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఎంతో ప్రాధాన్యం వున్న పుష్కరిణిని ఐదేళ్ల నుంచి దేవదాయ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. పూడిక, చెత్తాచెదారం పేరుకుపోయాయి. జమ్ము గడ్డి బలిసిపోయింది. కొంతమంది స్థానికులు తమ పశువులను పుష్కరిణిలోకి విడిచిపెడుతున్నారు. చివరకు మురికికూపంలా మారిపోయి తీవ్ర దుర్వాసన వస్తున్నది.

ఈ నేపథ్యంలో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పుష్కరిణిని అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు రూ.80 లక్షలు మంజూరు చేయించి, గత ఏడాది నవంబరులో శంకుస్థాపన చేశారు. పుష్కరిణి చుట్టూ ఘాట్‌లు నిర్మించడం, అడుగుభాగంలో కాంక్రీట్ నిర్మాణం, బయట నీరు పుష్కరిణిలో రాకుండా ఏర్పాట్లు, పుష్కరిణిలో బోర్లు తీయించి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు శ్రీకారం చుట్టారు. తొలుత పుష్కరిణిలో మురుగునీరు బయటకు తోడివేసి, తుప్పలు తొలగించే పనులు ప్రారంభించారు. దీంతో భక్తులు ఎంతో సంతోషించారు. కానీ శంకుస్థాపన చేసి ఎనిమిది నెలలు గడచినా, పనుల్లో ఎలాంటి పురోగతి కనిపించడంలేదు. పాలనపరమైన అనుమతులు రాకపోవడంతో పనులు చేపట్టలేదని అధికారవర్గాల సమాచారం. పరిపాలనాపరమైన అనుమతి ఎప్పుడు వస్తుంది? పనులు ఎప్పుడు మొదలవుతాయి? అన్న ప్రశ్నలకు అధికారుల వద్ద సమాధానాలు లేవు. ప్రస్తుతం వర్షాం కాలం కావడంతో పుష్కరిణిలో అభివృద్ధి పనులు చేయడానికి వీలుకాదు. అక్టోబరు చివరి వారంలో కార్తీక మాసం ప్రారంభం అవుతుంది. దీంతో కార్తీక మాసంనాటికి పుష్కరిణి బాగుపడే అవకాశాలు లేవని భక్తులు భావిస్తున్నారు.

క్రైం... crime news

చోరీ కేసుల్లో ఐదుగురి అరెస్టు

అనకాపల్లి టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండల పరిధిలో పలుచోట్ల చోరీలకు పాల్పడిన ఐదుగురు నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్టు డీఎస్పీ ఎం.శ్రావణి చెప్పారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో దర్శీగనర్, రేబాల్లో మూడుచోట్ల వేర్వేరు తేదీల్లో ఎల్ఈడీ టీవీ, కుమ్మరి మిషన్, ప్రింటర్, వెండి వస్తువులు, రెండు పెద్ద టైర్లు చోరీకి గురైనట్టు బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. బవులవాడ పంచాయతీ రిక్షా కాలనీకి చెందిన నడిగట్ల గురునాథ్, రిక్షా కాలనీకి చెందిన మాటూరు లోహిత్, దొడ్డి హేమంత్‌కుమార్, పల్లా గోవిందరావు, ఇందుకూరి దినేశ్‌వర్మలను అరెస్టు చేసినట్టు తెలిపారు. వీరిలో హేమంత్‌కుమార్, గోవిందరావు, దినేశ్‌వర్మ విద్యార్థులని, చెడు వ్యసనాలకు అలవాటుపడి డబ్బుల కోసం చోరీలకు పాల్పడుతున్నారని చెప్పారు. దొంగిలించిన వస్తువులను అనకాపల్లిలో అమ్మడానికి తీసుకువెళ్తుండగా దర్శీనగర్ మెయిన్‌రోడ్డు వద్ద పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారన్నారు. నిందితుల నుంచి రూ.2 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సమావేశంలో సీఐ జి.అశోక్‌కుమార్, ఎస్ఐ జి.రవికుమార్ పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- బీసీ సంక్షేమ శాఖ అధికారులకు మంత్రి సవిత ఆదేశం



మంత్రి సవితను సత్కరించి జ్ఞాపికను అందజేస్తున్న బీసీ సంక్షేమ శాఖ అధికారులు

అనకాపల్లి టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో బీసీ వసతిగృహాల విద్యార్థుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత సూచించారు. మంగళవారం సాయంత్రం అనకాపల్లి వచ్చిన ఆమె తన శాఖలకు చెందిన అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, చేనేత రంగం అభివృద్ధికి సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారని, అందువల్ల చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచాలని ఆదేశించారు. హాస్టళ్ల అభివృద్ధికి సీఎస్ఆర్, డీఎంఆర్, ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై దృష్టి సారించాలన్నారు. ఖాదీ, గ్రామీణాభివృద్ధి పరిశ్రల శాఖ ద్వారా యువత ఉపాధి కల్పనకు సబ్సిడీ రుణాలతో యూనిట్లు నెలకొల్పాలని సూచించారు.

మంత్రి దృష్టికి వసతిగృహాల సమస్యలు

జిల్లాలో 21 వసతిగృహాల్లో సంక్షేమ అధికారుల పోస్టులు, నాలుగో తరగతి సిబ్బంది పోస్టులు 42 ఖాళీగా వున్నాయని, వీటిని త్వరగా భర్తీ చేయాలని మంత్రి సవితను, వసతిగృహాల వార్డెన్లు కోరారు. మెస్ చార్జీలు పెంచాలని, వసతిగృహాల భవనాలకు మరమ్మతులు చేయించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అధికారులు శ్రీదేవి, గోపీనాథరావు, పద్మ, కార్తీక్, రమణమూర్తి, ఆర్పీ మురళీకృష్ణ, ఎస్.సత్యనారాయణ, పీలా నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న మంత్రి సవిత



నూకాంబిక అమ్మవారి సన్నిధిలో మంత్రి సవిత, కూటమి నాయకులు

స్థానిక నూకాంబిక అమ్మవారిని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత దర్శించుకుని పూజలు చేశారు. అంతకుముందు ఆలయ ఈవో సుధారాణి, మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను ఆమెకు స్వాగతం పలికారు. మంత్రి వెంట ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, యూఎఫ్ఐడీసీ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, తదితరులు ఉన్నారు.

అన్నదాతకు అండగా..

... 5వ పేజీ తరువాయి

సాంకేతికపరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించి, రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 254 గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాలు పూర్తయ్యాయని, ఆగస్టు నెలాఖరు వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు. రైతులు వ్యవసాయాధికారుల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, సమయం వృథా కాకుండా 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు.

27 వరకు వర్షాలు

... 5వ పేజీ తరువాయి

పిచికారీ చేయాలని తెలిపారు. వరి విత్తనాలను నేరుగా విత్తేటట్టయితే పొలంలో కలుపు సమస్య అధికంగా ఉంటుందని, అందువల్ల విత్తిన 25-30 రోజులకు లీటరు నీటికి 2,4డి అమైన్ సాల్ట్ 58 శాతం ఇ.సి.ని రెండు మిల్లీ మీటర్లు, 10 గ్రాముల యూరియా కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. జింకు లోపం నివారణ కోసం లీటరు నీటికి రెండు గ్రాముల చొప్పున జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలన్నారు. ఇనుముధాతు లోప నివారణ కోసం లీటరు నీటికి ఐదు గ్రాముల అన్నబేధి, 0.5 గ్రాముల నిమ్మఉప్పు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రాగి పంటను అగ్గితెగులు ఆశించే అవకాశం ఉందని, దీని నివారణకు లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజమ్ లేదా 0.6 గ్రాముల ట్రైసైక్లోజల్ కలిపి వర్షాల అనంతరం పిచికారీ చేయాలని చెప్పారు. 30 రోజులలోపు విత్తిన వేరుశనగ పంటకు మొదలు కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉందని, ఈ తెగులు ఆశించిన మొక్కలను పొలంలో నుంచి పీకివేసి, తెగులు ఆశించిన చోట కాపర్‌ఆక్సీక్లోరైడ్ మందును లీటర్ నీటికి రెండు మిల్లీలీటర్ల చొప్పున కలిపి మొక్క మొదలు బాగా తడిసేలా పిచికారీ చేయాలని ఏడీఆర్ ముకుందరావు తెలిపారు. ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు డాక్టర్ కె.వి.రమణమూర్తి, డాక్టర్ ఎం.విశాలాక్షి, డాక్టర్ వి.గౌరి, డాక్టర్ సిహెచ్.ఎస్.రామలక్ష్మి, డాక్టర్ పి.వి.పద్మావతి, డాక్టర్ ఎ.అలివేలు పాల్గొన్నారు.

పరవాడలో పట్టపగలు చోరీ

... 5వ పేజీ తరువాయి

అద్దెకు ఇచ్చేశారు. నాలుతో అంతస్థులోని పెంట్ హౌస్‌లో నివాసం వుంటున్నారు. మంగళవారం మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో భార్య సన్యాసమ్మతో కలిసి పోలానికి వెళ్లారు. సాయంత్రం 6.15 గంటలకు ఇంటికి చేరుకున్నారు. ప్రధాన ద్వారం తెరిచి లోపలికి వెళ్లిన వీరు బీరువా తెరిచి ఉండడం గమనించారు. ఆందోళనతో బీరువాను పరిశీలించగా మూడు తులాల నల్లపూసల తాడు, తులం బరువు వున్న రెండు ఉంగరాలతోపాటు రూ.50 వేల నగదు కనిపించలేదు. ప్రధాన ద్వారం తాళాలు తలుపునకే ఉంచేయడం, బీరువా తాళాలను బీరువా పైనే ఉంచడంతో దొంగలు సులువుగా చోరీకి పాల్పడ్డారు. వెంటనే ఈ విషయాన్ని కుమారుడు వెంకటరావుకు చెప్పడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ మల్లికార్జునరావు వెళ్లి,బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంతోషిమాత ఆలయం వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా.. ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి చోరీకి పాల్పడిన అనంతరం పరవాడ జంక్షన్ వైపు వెళ్లినట్టు గుర్తించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544